ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూలై 30, 2017

స్నేహ



ఇదీ బాల భారతం

ENTERED
KSR02B178

కట్టిపడేస్తున్న పంచెకట్టు

తెలుగు సినిమాలకీ పంచెకట్టుకీ కనెక్టివిటీ ఎక్కువే...నిన్న మొన్నటి దాకా కాస్త పాత ట్రెండ్‌లా అనిపించినా నేటి తారలకి ఇది కొత్తందాన్ని తెచ్చిపెట్టింది. ఎన్టీఆర్, ఏఎన్‌ఆర్‌లకే కాదు 'మురారి', 'వరుడు', 'అదుర్స్', 'మిర్చి', 'దరువు' చిత్రాల్లో మహేష్ బాబు, అల్లు అర్జున్, జూ.ఎన్‌టిఆర్, ప్రభాస్, రవితేజలకి ఈ పంచెకట్టు బాగా నప్పేసిందంటూ కితాబు ఇచ్చేశారు అభిమానులు.

అడపాదడపా చిత్రాల్లో పంచెకట్టుతో ప్రేక్షకులని మెప్పించే ఈ పాత ట్రెండ్ రిపీటయ్యింది కాస్త అటు ఇటుగా పవన్ కళ్యాణ్‌తోనే. 'కెమేరామెన్ గంగతో రాంబాబు' చిత్రంలో పంచెకట్టుతో ఓ పాటకి స్టెప్పులేశాడు పవర్‌స్టార్. ఇక పండుగ సీజన్లో రిలీజయ్యే చిత్రాల్లో హీరోలు పంచెకట్టులో మెప్పిస్తున్నారు. అలా సోగ్గాడే చిన్ని నాయనా చిత్రంలో నాగార్జున పల్లెటూరి పంచెకట్టుకి ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. ఆ తర్వాత వచ్చిన ప్రేమమ్‌లో నాగచైతన్య ఇదే ట్రెండ్‌ని ఫాలో అయితే.... 'గోవిందుడు అందరి వాడే' 'పిల్ల జమిందార్', రాధ, 'నేనే రాజు నేనే మంత్రి' 'డిజె' చిత్రాల్లో రామ్‌చంణ్. నాని, రాణా, శర్వానంద్ బన్నీల పంచెకట్టు స్టైల్ యువతని కట్టిపడేసింది.

కథా నిలయం
ENTERED
KSR02B178

మన రేస్‌వాకర్

కాళ్లకు బూట్లు లేకుండా ఓ చిన్నారి పరుగు. తండ్రి లేనితనం నుంచి పరుగు. పూట గడవని గుడిసె నుంచి పరుగు. బడి ముఖం ఓసారి చూసేందుకు పరుగు. బాల్య వివాహం కాకుండా పరుగు. ఆ చిన్నదాని పరుగును నెమ్మది చేసింది అమ్మ. నడకతోనే గెలుపు నేర్పాడు గురువు. 20 కి.మీ.ల రేస్‌వాకింగ్‌లో భారత్‌కు స్థానం కల్పించిన ఆ చిన్నారే ఇప్పటి ఖుష్బీర్ కౌర్. తల్లి, గురువుల అండతో విజయం వైపుగా మళ్లీ వేగంగా నడుస్తోంది. ఆ నడక కుటుంబాన్ని.. తమ ఊరి ఆడపిల్లల్ని, గ్రామాన్ని.. దేశాన్ని మారుస్తోంది.



పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు దగ్గరలోని గ్రామం రసూల్ పూర్ కలన్. ఆలోచనల్లో పూర్తిగా వెనుకబడిన ప్రాంతంలో ఉంది. ఆడపిల్లను షార్ట్-టీషర్ట్‌లో చూసేంత స్థితికి ఇంకా చేరుకోలేదు. అలాంటిది ఆమెను వదిలించుకోడానికి బాల్య వివాహాలు సాధారణం కాకుండా ఎలా ఉంటాయి. అక్కడే పుట్టి పెరిగింది ఖుష్బీర్ కౌర్. తనకు ఆరేళ్లుండగానే తండ్రి చనిపోయాడు. పెద్దక్క, తమ్ముడు, అమ్మే లోకం. అంతకన్నా ఆలోచిస్తే ఆకలి ఎక్కువవుతుంది. విశాలంగా ఉన్న ప్రపంచాన్ని చూసేందుకు పేదరికం అడ్డు తగులుతుంది. కడుపులోనే ఉండే ఆకలి ఎంత దూరం పరిగెడితే దూరం అవుతుంది! అది తెలీకే చిన్నప్పటి నుంచి పరుగును సహచరి చేసుకుంది. అనుమతి లేకుండా ఆడపిల్ల ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టడానికి లేదు. అలాంటి చోట తల్లి దన్నుగా నిలబడి ఆమె పరుగు ఆగకుండా చూసింది. చిన్నాచితకా పనులు చేసుకుంటూనే కూతురిని ఓ క్రీడాకారిణిగా పెంచింది. గ్రామం, బడిలోనే కాదు చుట్టు పక్కల ఎక్కడ పరుగు పందేలు జరుగుతున్నా కూతుర్ని వెంటబెట్టుకుని వెళ్లేది. ఖుష్బీర్ గెలవకున్నా ఫర్వాలేదు కానీ మిగతా అందరి పిల్లలతో అలా అయినా పోటీలో ఉంటే చాలు. కానీ ఖుష్బీర్ అంత చిన్న ఆనందంతో తల్లిని సరిపెట్టలేదు. అన్ని పోటీల్లో ముందుండేది. ఎన్నో బహుమతులు, ప్రశంసలు. 2007లో 14 ఏళ్ల వయస్సులో 3000 మీటర్ల రేస్‌వాక్‌లో స్టేట్ ఛాంపియన్‌గా నిలిచింది. అలా 2008లో జాతీయ జూనియర్ పోటీలకు వెళ్లింది. అక్కడ కాళ్లకు షూ లేకుండానే పరుగును విజయంతో ముగించింది. అందరూ షాక్. కానీ ఒకాయన మాత్రం ఆమె పాదాల్ని నెత్తిన పెట్టుకున్నాడు. అతడే మాజీ క్రీడాకారుడు బల్‌దేవ్. కోచ్‌గా మారి ఖుష్బీర్‌ను అంతర్జాతీయ క్రీడాకారిణిగా మలిచే లక్ష్యాన్ని ఏర్పరచుకున్నాడు. షూలు తొలిసారి తొడగడమే కాదు ఆమె క్రీడా జీవితాన్ని మార్చేసే రేస్ వాకింగ్ వైపు అడుగులు వేయించాడు. ఏదో ఒక పాదం నేలను అనుకునే ఉండాలనే నిబంధన రేస్ వాకింగ్‌లో కేవలం శారీరిక ధృఢత్వమే కాదు సాంకేతికత, మనో బలాన్ని కూడా పరీక్షిస్తుంది. ఈ నైపుణ్యం ఖుష్బీర్‌కు ఉన్నాయని బల్‌దేవ్ విశ్వసించాడు. అతడి అంచనా నిజమైంది. 20 కి.మీ. రేస్‌వాక్‌లో జాతీయ రికార్డును ఖుష్బీర్ నెలకొల్పింది.

గెలుపు బాట

2010లో యూత్ ఏసియన్ గేమ్స్‌లో, 2012లో ఏసియన్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లోను ఖుష్బీర్ పతకాలు సాధించింది. 2014లో ఏసియన్ రేస్ వాకింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించి సత్తా చాటింది. టైకాంగ్‌లో నిర్వహించిన వరల్డ్ రేస్ వాకింగ్ కప్‌లో (1:33:07 టైమింగ్‌తో) జాతీయ రికార్డును బద్దలుకొట్టింది. ఇంచియాన్‌లో నిర్వహించిన ఏసియన్ గేమ్స్‌లో విజయాన్ని నమోదు చేసింది. మాస్కోలోను, రియోలోను ప్రతిభ చాటింది. 20 కి.మీ.లే కాకుండా 5000 మీటర్లు, 10 వేల మీటర్ల రేస్‌వాక్‌లోను ఆమె మంచి ప్రదర్శన ఇచ్చింది. ఈ ఆగస్టులో లండన్‌లో జరగబోతోన్న అథ్లెటిక్స్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో 20 కి.మీ.ల రేస్‌వాక్‌లో దేశానికి ప్రాతినిథ్యం వహిస్తోంది. మొన్న రియోలో ఇచ్చిన ప్రదర్శనతో రాబోయే ఒలింపిక్స్‌లో ఓ పతకం ఆశించొచ్చని కోచ్‌లు అంటున్నారు. ఒకప్పుడు ఆకలి బాధ ప్రపంచానికి అడ్డుపడి పరుగు అందుకుంటే... ఇప్పుడు నడకతో ఆకలి బాధను కుటుంబానికి దూరం చేసింది. ఆమెను చూసి గ్రామంలోని మిగతా ఆడపిల్లలూ అథ్లెటిక్స్‌పై ఆసక్తి చూపుతున్నారు. బాల్యవివాహాలు దాదాపు జరగడం లేదు. ఇప్పుడు ఆ ఊళ్లో ఆడపిల్లలు షార్ట్, టీ షర్ట్ వేసుకుని ప్రాక్టీస్‌కు వెళ్లడం సాధారణ దృశ్యమైపోయింది.

- అనన్య ప్రసిద్ధ్

ఆటు పోట్లు

ఏషియాడ్‌లో పతకం సాధించినందుకు ఖుష్బీర్‌కు ఎన్నో ప్రశంసలు అందాయి. అలాగే ఆమె ఇంటి పరిస్థితి తెలిసి సాయం చేస్తామంటూ కొందరు ముందుకు వచ్చారు. ఇంచియాన్ విజయం తర్వాత అమృత్‌సర్‌లోని ఖల్సా మహిళా కళాశాల వారు పక్కా ఇల్లు కట్టుకునేందుకు 5 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పారు. అప్పుడు రియో ఒలింపిక్స్ కోసం ఖుష్బీర్ పోర్చ్‌గల్‌లో శిక్షణ తీసుకుంటోంది. ఇంటివారికి చెప్పడంతో ఉన్న గుడిసెనూ విప్పేశారు. కానీ ఏ సాయం అందలేదు. చేసేది లేక తాత్కాలికంగా పశువుల పాకలోకి మారారు. వాళ్లక్కడ నానా అవస్థలు పడుతున్న విషయం తెలిసి ఖుష్బీర్ చాలా బాధపడింది. తన జీవితంలో ఓ విజయం ఇంటివారికి చేదును మిగల్చడమేంటని కుంగిపోయింది. ఈ ఏడాది మొదట్లో మరో ఎదురు దెబ్బ తగిలింది. జాతీయ పోటీల్లో పాల్గొంటే ఎక్కడ గాయాలవుతాయోనని ఖుష్బీర్‌ను రష్యన్ కోచ్ ఆపేశాడు. ఇది తెలిసిన నిర్వాహకులు ఆమెను కొన్ని పోటీల నుంచి తప్పించారు. ఇదో వివాదమైంది. ఓ క్రీడాకారుడి జీవితంలో ఎన్నో ఆటుపోట్లుంటాయి.

ఇండెక్స్

నా కళ్ళతో 3
ఖాళీ జేబు యాత్రికుడు

స్టార్........4
వియత్నాం పులి

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10
హైనాతో స్నేహం

తెలుసా............... 11
అణుప్రమాదం అంచుల్లో..

కవిత్వమ్...............14
నేనో హరివిల్లునయ్యా..

ఇదీ బాలభారతం

అట్టమీది కథ...6

కులాన్ని కూల్చే సాహసం ఆపాత చిత్రం- 12

కథ 15
సింగిల్ పేరెంట్

కొత్త పుస్తకాలు 18
గాయపడ్డ కవి ఘోష

వివరం 20
పుస్తకాల బండి

రుచి.....................21
పనీర్ ఎగ్ కర్రీ

బాల నేస్తాలు.............23
బర్డ్ ఫీడర్

పద వికాసం........24

ఉద్వేగభరితం

ఈ వారం అట్టమీది కథ 'నల్లజాతి సూరీడు' స్ఫూర్తిదాయకంగా వుంది. ఆఫ్రికాలో నల్లజాతి ప్రజల విముక్తి కోసం సుదీర్ఘకాలం పోరాడిన మండేలా జీవితం ఉద్వేగ భరితం. ప్రజల కోసం సంవత్సరాల తరబడి జైల్లో గడిపిన ప్రజల మనిషి, నిష్కళంక దేశాభిమాని నెల్సన్ మండేలా ఒక పర్యాయం మాత్రమే దేశాధ్యక్షుడిగా ఉండి, మిగతా శేష జీవితాన్ని ప్రజాసేవలో గడిపిన తీరు ఇతరులకి మార్గదర్శకం. మండేలా ఆఫ్రికా జాతికే కాదు ప్రపంచానికే సూరీడు.

-మంకు శ్రీను, కొవ్వూరు.

గొడుగు చెట్టు

గ్రానైట్, సున్నపురాతితో నిండిన కరకైన ఎడారి ప్రాంతంలో మనుగడ సాగిస్తున్న డ్రాగన్ బ్లడ్ చెట్టు చిత్రాలు అబ్బురపరిచాయి. 'నేను చూసిన చైనా'లో షాంఘై నగర పరిచయం ఆకట్టుకుంది. కన్ఫ్యూషియస్ ఆలయం, సన్‌యెట్ సేన్ సమాధులు, లోటస్ బుద్ధ ప్రస్థావనలు ఆసక్తికరంగా వున్నాయి. ముఖ సౌందర్యం కంటే... అమ్మతనం ఆప్యాయతే గొప్పదని చెప్పిన కథ, ఆపాత చిత్రం 'మిస్సమ్మ' చదివించాయి. అమ్మాబ్రష్‌ని చదివాక ముందు ముందు ఎవరూ ఇక పళ్ళు తోమరు అనిపించింది. 'గొడుగు గోయిందా', 'స్టాట్యూ', 'కళలతోట', అట్టమీది కథ 'నల్లజాతి సూరీడు' కళాగ్రామం బాగున్నాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

టి. అంకిత, అనంతపురం.

కళల తోట

ఏడుపదులకు దగ్గరవుతున్నా ఇంకా సృజన రంగానికి కొత్త అందాల్ని అద్దుతూనే వున్న తోట తరణికి హ్యాట్స్ ఆఫ్. అర్జున్‌లో మధురమీనాక్షి గుడి సెట్స్ ఆయన తీర్చిదిద్దినవేనని తెలిసి ఆశ్చర్యపోయాం. ఉయ్యాలవాడ నరసింహారెడ్డిలో పనిచేస్తున్న తరణి పనితీరుపై ఎక్స్‌పెక్టేషన్స్ మరింతగా పెరిగాయి. గోడచిత్రాలు, హస్తకళలకి ఏదో ఒక ప్రాంతం ఫేమస్ అవుతుంది. అలాంటిది ఒడిశాలోని ఓ గ్రామం మొత్తం గోడచిత్రాలతో పేరు తెచ్చుకోవడం ఆశ్చర్యపరిచింది. శ్వేతజాతి దురహంకారుల నుండి నల్లజాతి ప్రజలకు విముక్తి తేవడానికి జీవితాన్ని పణంగా పెట్టి పోరాడిన యోధుడి పరిచయం నల్లజాతి సూరీడు అట్టమీది కథ ఆకట్టుకుంది.ఆ పాత చిత్రం మిస్సమ్మ, అరచేతులు అడ్డుపెట్టి కవిత, గొడుగుచెట్టు, 'అందం' కథ, 'గొడుగు గోయిందా' 'ఇక పళ్ళు తోమరు', 'కళా గ్రామం' ఇవీ మన చిత్రాలే బాగున్నాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

-ఎల్. శ్రీనివాసరావు, విజయవాడ.

నల్లజాతి సూరీడు

నల్లజాతి సూరీడు అందరికీ వెన్నెల నేరేడు ఆదర్శప్రాయుడు ఆ మహనీయుని గురించి ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో కవర్ పేజీ కథనం ప్రచురించడం అభినందనీయం. వారం వారం అదివారం అనుబంధం సర్వాంగ సుందరంగా వుంటోంది.

ఎల్. ప్రఫుల్లచంద్ర, ధర్మవరం.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఖాళీ జేబు యాత్రికుడు

విమల్ ఇంజినీర్ అవ్వాలనుకున్న ఓ యువకుడు. కానీ, చదువును మధ్యలోనే వదిలేశాడు. కాలేజీ వయసులోనే ట్రావెలర్ అవ్వాలనే కోరిక కలిగింది. అప్పటి నుంచి విమల్ సంచారజీవిలా మారాడు. 9 నెలల్లో 11 రాష్ట్రాలు తిరిగాడు. అది కూడా ఒక్క పైసా చేతిలో లేకుండా, ఎలాంటి ప్లానింగ్ లేకుండా!

పైసా లేదు.. ప్రణాళికా లేదు.. ఆకాంక్ష తప్ప! ఏ విహారయాత్రకు వెళ్లాలన్నా ముందుగా ఓ ప్రణాళిక, కొంత మొత్తంలో డబ్బులు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. అదే మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు ఏదైనా ప్రాంతాన్ని వీక్షించాలనుకుంటే అందుకు సరిపడా మొత్తాన్ని రోజుల తరబడి పోగు చేసుకుంటూ ఉంటారు. ప్రాంతం ఏదైనా డబ్బులు ఉండాల్సిందే కదా! వాటికి తగిన ప్లానింగ్ కూడా అవసరమే! కానీ, కొంతమంది అసలు ఎలాంటి ప్లాన్ లేకుండానే ఇతర ప్రాంతాలను చూడ్డానికి, తిరగడానికి వెళ్తుంటారు. అలాంటివారు వారికి ఏది ఇష్టమనిపిస్తే దాన్నే చేస్తుంటారు. అనంతపురానికి చెందిన విమల్‌కుమార్ కూడా ఈ కోవకు చెందినవాడే.

ఆయన తన ట్రావెలింగ్‌ను ఇతరులిచ్చే లిఫ్ట్‌తో బైక్‌లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు, ట్రక్, ట్రైన్, కారు ఇలా ఏ వాహనం దొరికితే దానితో ప్రయాణం కొనసాగించాడు. అతనొక మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. మధ్యతరగతి కుటుంబాల్లో సాధారణంగా ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడమే చాలా కష్టంగా ఉంటుంది. అలాంటిది ఇలాంటి కోరికలు ఉన్నా గానీ వాటిని తీర్చుకోలేని పరిస్థితిలో ఉంటారు. ట్రావెల్ చేయడానికి డబ్బులెవరిస్తారు? మొదటి నుంచి విమల్ ఎలాగోలా కొంత డబ్బు సంపాదించేవాడు. పిల్లలకు ట్యూషన్ చెప్పడం. షార్ట్ ఫిల్మ్స్ తీసి డబ్బులు సంపాదించడం లాంటివి చాలా ఇష్టపడి చేసేవాడు. విమల్‌కి ట్రావెలింగ్ అంత సులభతరమైన విషయమేమీ కాలేదు. మొదటగా విమల్ సంవత్సరంలోపు అన్ని ప్రాంతాలను చుట్టేయాలని ప్లాన్ వేసుకున్నాడు. కానీ, కుటుంబ సమస్యల కారణంగా అతని ఫ్యామిలీ బెంగుళూరు షిఫ్ట్ అయ్యింది. ఈ కారణంచేత అతను తొమ్మిది నెలల్లోనే తన యాత్రను పూర్తిచేసుకున్నాడు. విమల్

వచ్చేటప్పుడు మాత్రం రెండు బ్యాగులు ఉన్నాయి. ప్రయాణంలో చాలా సమస్యలు ఎదుర్కొన్నాడు. విశాఖపట్నంలోని ఓ చిన్నగ్రామం లంబసింగిలో జీవితంలో మర్చిపోలేని ఓ సంఘటన జరిగింది. విమల్‌కు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బాగా ఆకలేసింది. చేతిలో చూస్తే చిల్లిగవ్వలేదు. ఎవరిని అయినా అడుగుదామంటే మనసు అంగీకరించలేదు. అలా ఎవరి సహాయం తీసుకోకూడదనే ముందుగానే అనుకున్నాడు విమల్. ఒక మూసివున్న దుకాణం దగ్గర అలా ఆకలితో కూర్చున్నాడు. అదే సమయంలో అటుగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు విమల్‌ని చూసి ఆగారు. 'ఇక్కడేం చేస్తున్నారు' అని అడిగారు. నేను లంబసింగి వెళ్లాలి అని విమల్ సమాధానమిచ్చాడు. ఇద్దరిలో ఒకరు ఏమైనా తిన్నారా? అని అడిగారు. లేదు తినలేదు అని చెప్పాడు. తన దగ్గరున్న రెండు బ్రెడ్ ప్యాకెట్స్ తీసి విమల్‌కి ఇచ్చారు. ఆ సమయంలో విమల్‌కు కడుపులో ఎలుకలు పరుగెత్తుతున్నాయి. అది బ్రెడ్ ముక్కా లేక బిస్కెట్ ముక్కా అని ఆలోచించకుండానే తీసుకొని తినేశాడు. మనుషుల మధ్య ఉంటే సరిపోతుంది. సాయం వారే చేస్తారు అనే నమ్మకం వచ్చింది విమల్‌కు. అలా తిరుగుతూ

తన యాత్ర ద్వారా చాలా నేర్చుకున్నాడు. విమల్ ఇప్పటివరకూ దక్షిణ భారత్‌తో సహా ఆరు రాష్ట్రాలను, మహారాష్ట్ర, మేఘాలయ, అస్సాం, నాగాలాండ్, పశ్చిమబెంగాల్ అన్నీ తిరిగివచ్చాడు. ఈ యాత్రలో విమల్‌కు కొంతమంది మంచి స్నేహితులు కూడా తారసపడ్డారు. ఒకసారి విమల్ ఫోన్ డెడ్ అయ్యింది. విమల్ స్టోరీ విన్న

జర్మనీకి చెందిన ఓ టూరిస్టు విమల్‌కు ఐఫోన్‌ను బహుమతిగా ఇచ్చారు.

విమల్ ప్రయాణానికి సిద్ధమైనప్పుడు తన దగ్గర అంత లగేజీ లేదు. కానీ, తిరిగి తన ఇంటికి

సోనాగచి ప్రాంతాన్ని చేరుకున్నాడు. సోనాగచి ఆసియాలోని ఒక పెద్ద రెడ్‌లైట్ ఏరియా. అక్కడ సెక్స్ వర్కర్స్ పరిస్థితిని చూసి విమల్ మనసు చలించిపోయింది. సంచారం అనేది మనిషిని సమాజంలోని ఒక బాధ్యత గల వ్యక్తిగా మారుస్తుంది అని విశ్వసించాడు. యాత్రికుడు, సాహిత్యకారుడు రాహుల్ సాంకృత్యాయన్ 'మనిషి పుట్టుక అనేది ఒకేసారి ఉంటుంది. యువకుడిగా మారడం కూడా ఒకేసారి జరుగుతుంది. అందుకే, యువకుల్లారా! ప్రపంచాన్ని చుట్టేయడానికి నడుం బిగించుకోండి. ప్రపంచం మొత్తం మీకు స్వాగతం పలకడానికి సిద్ధంగా ఉంది' అని అన్నారని గుర్తుచేస్తున్నాడు విమల్. ఎందుకంటే ఆయన చేతిలో పైసా లేదు.. వెళ్లేందుకు ప్రణాళికా లేదు.. ఉన్నదంతా ఒక్క ఆకాంక్ష మాత్రమే!!

- అమల తిలారు

స్టార్



వియత్నాం పులి

'మన్యం పులి' సంచలనం వెనుక మరో 'పులి' ఉందని మోహన్‌లాల్ చెబుతాడు. అతడే పీటర్ హెయిన్. స్టంట్ మాస్టర్‌గా ఈ మధ్యే తొలి జాతీయ పురస్కారాన్ని దక్కించుకున్నాడు. మురారి, మగధీర, గజిని, రావన్, రోబో, బాహుబలికి తన యాక్షన్ కొరియోగ్రఫీతో బలాన్ని పెంచాడు. ఇప్పుడు మోహన్‌లాల్ సినిమాతో దక్షిణాది దర్శకుడిగా మారబోతున్నాడు. ఓ స్టంట్ బాయ్ నుంచి స్టంట్ కొరియోగ్రాఫర్ వరకు పీటర్ హెయిన్ పోరాటమే ఈ వారం స్టార్.

పీటర్ హెయిన్ తల్లి కుటుంబం వియత్నామ్ శరణార్థులు. వారు భారత్‌కు వచ్చి చెన్నైలో స్థిరపడ్డారు. ఇక్కడే కరైకల్‌లో పీటర్ జన్మించాడు.

- చిన్నప్పుడు తన బామ్మకు ఆరోగ్యం బాగోలేకపోతే నాలుగో తరగతిలోనే స్కూల్ మానేయాల్సి వచ్చింది. ఖాళీగా ఉండలేక స్థానిక టీ కొట్టుకు నీళ్లు మోసి పావలా చొప్పున సంపాదించేవాడు.
- తండ్రి పెరుమాల్ స్టంట్‌మెన్. ఓ గాయం కారణంగా మంచంపట్టాడు. పీటర్ తల్లి ఓ పార్లర్‌లో నెలకు 300 రూపాయల జీతానికి పనిచేసేది. పక్షవాతం వచ్చిన బామ్మ, పీటర్, అతడి ఇద్దరు అక్కచెల్లెళ్లు, తండ్రి అంతా కూడా ఆమె సంపాదన మీదే ఆధారపడ్డారు.
- బాల్యం పేదరికం చుట్టూనే తిరిగింది. రాయ్‌పేట ఆస్పత్రిలో వార్డ్ బాయ్‌గా పనిచేశాడు. ఆ తర్వాత సేల్స్ రెప్రజెంటేటివ్‌గా, హోటల్‌లో బాయ్‌గాను చేశాడు.
- 12 ఏళ్లకే పీటర్ వియత్నాంకు చెందిన మార్షల్ ఆర్ట్స్ 'వీట్ వా డావో', కుంగ్ ఫూ, కరాటే కూడా నేర్చుకున్నాడు. ఆ తర్వాత తండ్రి నడిపిన మార్షల్ ఆర్ట్స్ స్కూల్‌లో శిక్షణ కూడా ఇచ్చేవాడు.
- పీటర్‌కు 17 ఏళ్ల వయస్సున్నపుడు విజయ్‌కాంత్ హీరోగా నటించిన 'కావియా తలైవన్' (1992)లో విలన్‌గా అవకాశం వచ్చింది.
- ఆ తర్వాత అజిత్‌ను పరిచయం చేసిన 'అమరావతి' చిత్రంలో జూడో రాము దగ్గర స్టంట్‌మెన్‌గా చేరాడు. తర్వాత జాగ్వర్ తంగమ్ వద్ద పనిచేశాడు. తన ప్రతిభతో స్టంట్ బాయ్‌గా యాక్షన్ డైరెక్టర్లు విజయన్, కనల్ కన్నన్ దగ్గర అసిస్టెంట్‌గా చేరాడు.
- చిరంజీవి, రజనీకాంత్, కమల్ హాసన్, వెంకటేష్‌లకు బాడీ డబుల్‌గా స్టంట్లు చేశాడు. 'ముత్తు'లో మీనాకు కూడా బాడీ డబుల్‌గా గుర్రపు స్టంట్ చేశాడు. ఆమే కాదు విజయ శాంతి, రోజా, రంభ, అశ్వినిలకు కూడా.
- 1999లో అర్జున్ హీరోగా వచ్చిన 'ఒకే ఒక్కడు' (తమిళ్ మూధవలన్)లో పీటర్ చేసిన ఓ భీకరమైన స్టంట్ ఒక్కసారిగా 'టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ'గా మారిపోయింది. పెట్రోల్ పోసుకున్న శరీరంపై నిప్పంటించుకుని చేసే ఆ స్టంట్ గగుర్పాటుకు గురి చేస్తుంది. ఇది ఎటువంటి భద్రత లేకుండా పీటర్ చేసి గాయపడ్డాడు.
- 2001లో కృష్ణ వంశీ 'మురారి' చిత్రం ద్వారా పీటర్ హెయిన్ స్టంట్ కొరియోగ్రాఫర్‌గా మారాడు. ఉపేంద్ర 'రా' చిత్రానికి యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా మారాడు.
- అలా అంజి, రన్, కాకా కాకా, అతడు, అన్నియన్, ఛత్రపతి, శివాజీ వంటి సినిమాలకు యాక్షన్‌ను, స్టంట్లను డైరెక్ట్ చేసి మంచి పేరు సంపాదించాడు.



- 'మగధీర'లోని వందమంది యోధులతో హీరో పోరాడే యాక్షన్ పార్ట్ ఆ చిత్రానికే హైలెట్‌గా నిలిచింది.
- సైఫై చిత్రమైన 'రోబో'లోని యాక్షన్ కూడా మతి పోగొట్టేలా ఉంటుంది. ఈ చిత్రం చిత్రీకరణ సందర్భంలోనే 2009లో బాగా దెబ్బతిన్నాడు. 20 రోజుల షూటింగ్‌లో 18 ఫ్రాక్చర్లు అయ్యాయి. వీల్‌చైర్ మీద కూర్చునే యాక్షన్ పార్ట్‌ను పర్యవేక్షించాడు.
- రామ్ గోపాల్ వర్మ 'జేమ్స్' చిత్రం ద్వారా బాలీవుడ్‌లోకి ప్రవేశించిన పీటర్ అక్కడ కూడా తన ప్రతిభతో రాణించాడు. ముఖ్యంగా హిందీలో తీసిన 'గజిని' చిత్రంతో అక్కడ కూడా వీరాభిమానులు తయారయ్యారు.
- ఇప్పటి వరకు మనం యాక్షన్ హీరోలకే భారీ కటౌట్లు పెట్టి అభిమానం ప్రదర్శించడం చూశాం కానీ తమిళ్‌నాడులో అలాగే మన తెలుగు సీమల్లోను అక్కడక్కడా పీటర్ హెయిన్ కటౌట్లు, పోస్టర్లు సినిమా విడుదల సందర్భంలో వెలుస్తుంటాయి.
- 'బాహుబలి' చిత్రం ద్వారా పీటర్ హెయిన్ స్థాయి ఏంటో ప్రపంచానికి తెలిసింది. టారస్ వరల్డ్ స్టంట్ అవార్డ్ నామినేషన్‌కు కూడా ఎంపికయ్యాడు.
- 'మన్యం పులి' చిత్రం కోసం నెలల ముందు నుంచే ప్లాన్ చేసుకున్నాడు. పులుల్ని దగ్గరి నుంచి గమనిస్తూ వాటి కదలికల్ని, పోరాటాన్ని విశ్లేషించి స్టంట్‌లు, యాక్షన్‌ను చిత్రంలో పండించాడు. పులుల మధ్య కూడా మెలిగిన పీటర్ ఎంతో సాహసోపేతంగా సినిమాకు పనిచేశాడు.
- ఎం.టి. వాసుదేవన్ నాయర్ రచించిన భీముడు ప్రధాన పాత్రగా వచ్చిన మహా భారతం వర్షన్ 'రండమూజమ్'ను సినిమాగా తీసే ప్రాజెక్ట్‌లో పీటర్‌కే యాక్షన్ డైరెక్టర్ అవకాశాన్నిచ్చారు. ఇది 1000 కోట్ల ప్రాజెక్ట్. భారతీయ సినిమాలో అతి పెద్ద బడ్జెట్ చిత్రం.
- ఇప్పటి వరకు ప్రమాదాల్లో 27 సార్లు ఎముకలు విరిగాయి.
- ప్రస్తుతం మహేష్ బాబు 'స్పైడర్', సుందర్ సి. 'సంఘమిత్ర', కంగనా రనౌత్ 'మణి కర్ణిక- ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ', మోహన్ లాల్ 'ఒడియన్', 'విలన్'లకు పనిచేస్తున్నాడు.
- వియత్నామీస్-చైనా చిత్రం 'సామ్‌హోయి'కి దర్శకత్వం వహిస్తున్నాడు. ఓ బాక్సర్ జీవిత కథ ఆధారంగా తీస్తున్న ఈ చిత్రం భారతీయ భాషల్లోను విడుదల కాబోతోంది.

- జేఎస్

నవ్వుల్ - పువ్వుల్

తెలివి తక్కువ

రామరావు : ఇదేంటి ఏటిఎమ్‌లోంచి డబ్బులు రాకుండా చెంప పిన్నులొస్తున్నాయి.
వెంగళప్ప : ఎంటర్ యువర్ పిన్ అని కనబడితే
మా ఆవిడ చెంప పిన్నులని దూర్చా....!

దొందూ దొందే...

భార్య : ఎక్కడికి వెళుతున్నారు?
భర్త : ఇక లాభంలేదు నీకు విడాకులిచ్చేద్దాం అనుకుంటున్నా....అందుకే లాయర్‌ని కలిసేందుకు వెళుతున్నా ...
కొంతసేపటికి ఇంటికి తిరిగొచ్చిన భర్తతో....
భార్య : వెళ్ళిన పని ఏమయ్యింది??
భర్త : లాయర్ ఇంటి పనిలో బిజీగా వున్నాడు.....!!

కిసుక్కు

ఇద్దరు ట్విన్స్ ఒక రూమ్‌లో వున్నారు. ఇంతలో వాళ్ల డాడీ వచ్చి...
అదేంట్రా వాడు అలా ఏడుస్తుంటే నువ్వు అలా నవ్వుతున్నావ్.
మొదటి వాడు : ఈ వర్షంలో నేననుకుని మమ్మీ వాడికే మళ్ళీ స్నానం చేయించింది డాడీ!

తీసుకొచ్చా

శ్రీను : ఏంట్రా కొత్త కుర్చీ కొన్నావా...?
హేమంత్ : నేను కొనలేదురా నిన్న ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు టేక్ యువర్ సీట్ అన్నారు.... వెంటనే ఇంటికి తీసుకొచ్చేసా...

టెలిఫోన్ డైరెక్టరీ

వెంగళ్ : ఈ పుస్తకాన్ని చదవలేకపోతున్నా..
లైబ్రేరియన్ : ఏమైంది సార్?
వెంగళ్ : ఇందులో వేల పాత్రలున్నాయి. అర్థం కావట్లేదు.
లైబ్రేరియన్ :అయితే మా టెలిఫోన్ డైరెక్టరీని పట్టుకెళ్లింది మీరన్నమాట..!
వెంగళ్ : ఆ..!!

కిసుక్కు సిత్రం



వెళ్లిపోమాకే.. ఎదనే ఒదిలి వెళ్లిపోమాకే...!



నాకు నచ్చిన చిత్రం

ఇల్లస్ట్రేటర్: మార్కో మెల్‌గ్రాటి

సేకర్త: పి.బాలు, మచిలీపట్నం

ఇదీ.. బాల భారతం

బాలల వినోదం, విజ్ఞానం, వికాసం ఎవరి బాధ్యత? ప్రస్తుతం దేశంలో చిన్నారుల పరిస్థితి ఏంటి? తల్లిదండ్రుల నుంచి ప్రభుత్వాల వరకు పిల్లల్ని ఎలా . తీర్చిదిద్దాలి? మనది బాల భారతమేనా అనే విషయంపై ఈ వారం అట్టమీది కథ.

- కె. రమాదేవి

9492348428

చందమామను చూపించి గోరు ముద్దలు తినిపించడం... తండ్రితో పాటు తాను టై కట్టుకుంటే బైక్ మీద స్కూల్‌కు తీసుకెళ్లడం... బామ్మ ఒళ్లో కూర్చోబెట్టుకుని నీతి కథలు చెప్పడం... ఇవన్నీ కూడా సినిమాల్లోనో, సీరియళ్లలోనో, టీవీ యాడ్స్‌లోనో వస్తే మనసు నిండిపోతుంది. ఈ దృశ్యం ప్రతి చోటా ప్రతి ఇంటా కనిపిస్తుందనుకునేంతగా ఇవి సాధారణం అయిపోయాయి మన జీవితాల్లో. సమాజానికి కూడా ఈ దేశపు బాల చక్కగా పెరిగి పెద్దోడైపోతోందనేది ఓ భ్రమ. బాలలు అంటే సంతోషం పౌడర్ అద్దుకున్న ముఖాలే కనిపించేంత బొమ్మనే పదే పదే మనం చూస్తున్నాం. మాట్లాడుకుంటున్నాం. గుర్తు పోల్చుకుంటున్నాం. కానీ బొరుసు వైపున్న నిజం దృశ్యం అలా లేదు.

బాల భారతం ముద్దుగా బొద్దుగా పెరగడం లేదు. పోషకాహార లోపంతో కాళ్లు పొట్టలోకి నీరసంగా కూడదీసుకుంటోంది. చదువు సంధ్యలేక అక్షరం ముక్కని విసిరికొట్టి బడి నుంచి ఈడ్చేయబడుతోంది. కథలు వినే తీరిక లేక బాల కార్మికురాలిగా బానిస బతుకు వెళ్లదీస్తోంది. భారతదేశంలో బాలలు అంటే 18 ఏళ్ల లోపు పిల్లల సంఖ్య 44.9 కోట్ల పైమాటే. మొత్తం జనాభాలో వీరిది 37% వాటా. అంటే ఇది యువ భారతే కాదు బాల భారత్ కూడా. ఈ పసితనాన్ని పసిడి వెలుగుల వైపు తీర్చిదిద్దితేనే దేశం గొప్పగా ఉంటుంది. పుష్టిగా పెంచితేనే రాబోయే సమాజం దృఢంగా నిర్మితమవుతుంది. వికాసంలో విచ్చుకుంటేనే భవిత బాగుంటుంది. కానీ బాల భారత్‌ను అందరూ నిర్లక్ష్యం చేస్తున్నారు. పిల్లల పెంపకం మీద తల్లిదండ్రులది, గురువులదే కాదు సమాజానిది, ముఖ్యంగా ప్రభుత్వానిదీ బాధ్యతే. కానీ జనాభాలో 37% వున్న బాలలకు కేంద్ర బడ్జెట్ 4.52% మాత్రమే ఉండటం ఆలోచించాల్సిన విషయం. ఇది అనేక విషయాల మీద ప్రభావం చూపుతోంది. పోషకాహారం అందని బలహీనత, చదువు దక్కని వెనుకబాటుతనం, ఆకాంక్షలు నెరవేరని నిస్సహాయత బాల్యాన్ని చిదిమేస్తోంది. (2011 జనాభా లెక్కల ప్రకారం) ప్రతి నలుగురిలో ఒకరు స్కూల్ డ్రాప్ అవుట్. అంటే సుమారు పది కోట్ల మంది బాలలు చదువు నుంచి పక్కకు తప్పుకుంటున్నారు. ప్రతి వంద మందిలో 32 మంది మాత్రమే పాఠశాల విద్యను పూర్తి చేస్తున్నారు. సుమారు నాలుగున్నర కోట్ల మంది బాల కార్మికులు దేశంలో ఉన్నట్టు అంచనా. అనధికారికంగా వీరి సంఖ్య ఇంకా ఎక్కువే ఉండొచ్చు. పసితనం ఛాయలు ఇంకా తగ్గని వయస్సు నుంచే వెట్టి పనుల్లో చిక్కుకుపోతున్నది ఎంతోమంది. ఈ లెక్కలు మన బాధను ఇంకా పెంచేస్తాయి. 5-14 ఏళ్ల వయస్సున్న బాల కార్మికులు 1 కోటి 1 లక్ష మంది వున్నారని ఓ అధికారిక లెక్క. ఇక 5-18 ఏళ్ల మధ్య వయస్సున్న పని పిల్లలు 3 కోట్ల 30 లక్షల మంది పైమాటే. వీరిలో చాలామంది అత్యంత కఠిన వాతావరణంలో ప్రమాదకర పనుల్లో సుదీర్ఘ పనివేళల్లో బండ చాకిరీ చేస్తున్నవారే. ఈ పనిని చేయగలిగేంత పోషకాహారం కూడా అందక చిక్కిశల్యమైపోతున్న వారే. ఇదంతా ఒక ఘోరపు దృశ్యమైతే. మరోవైపు అవయవ మాఫియా, వ్యభిచార మాఫియాల హ్యూమన్ ట్రాఫికింగ్‌ల్లో లక్షలాది మంది బలైపోతున్నారు. ప్రతి 8 నిమిషాలకు ఒక

బాలుడు/బాలిక కిడ్నాప్ లేదా తప్పిపోతున్నారని లెక్కలు వింటుంటే దేశంలో బాలలకు ఎంత రక్షణ ఉందనే భయం కలవరపెడుతోంది. గత పదేళ్లలో బాలల మీద నేరాలు 5 రెట్లు పెరిగాయి. పరీక్షల్లో విఫలమైన కారణంగా అత్యధికంగా బాలలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనే విషయం చూస్తే వీరిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం ఒత్తిడి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. (ASDI -2014 భారత దేశ ప్రమాణాలు మరియు ఆత్మహత్యలకు మార్గాలు). సగం మంది బాలలకి (54%) మాత్రమే పూర్తిగా రోగ నిరోధక టీకాలు అందుతున్నాయి. 3 సం.ల లోపు పిల్లలు 45% పౌష్టికాహార రక్తహీనత లోపంతో బాధపడుతున్నారు. మొదటి పుట్టిన రోజు జరుపుకోకుండా 8.5 లక్షల మంది ఏడాదిలోపే చనిపోతున్నారని లెక్కలు. దీనికి పరోక్షంగా బాల్య వివాహాలు ఓ కారణమే. చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు కావడం వల్ల బిడ్డను ఆరోగ్యంగా కనలేకపోవడం ఆ తర్వాత పెంపకం విషయంలో సరైన అవగాహన లేకపోవడం ఒక కారణమైతే... పేదరికానికీ బాల్య వివాహాలకు ఉన్న లంకె మరో ముఖ్య కారణం. దేశంలోని పిల్లల్లో దాదాపు సగం మందికి 42% బాల్య వివాహాలు జరిగిపోతు న్నాయి. వీటికి అడ్డుకట్ట పడటం లేదు. 15 సం.ల లోపు వున్న పెళ్లైన బాలికల్లో 70% మందికి ఇద్దరు పిల్లలు వున్నారు (సెన్సస్ 2011).

బాలల భవిష్యత్

మన జీవితంలో చాలా ముఖ్యమైన భాగం మన పిల్లలు, వారి భవిష్యత్. వారే మన దేశానికీ, ప్రపంచానికి కూడా భవిష్యత్. వారే చరిత్ర సృష్టిస్తారు. మనం కూడా పిల్లలు బాగా ఎదిగి చదువులు, ఆటలలో మేటిగా వుండాలని బాగా స్థిరపడాలని కోరుకుంటాము. కొంతమంది తల్లిదండ్రులయితే పిల్లలతో చాలా కటువుగానూ, క్రూరంగానూ వ్యవహరిస్తుంటారు. అలా ఐతేనే పిల్లలు పైవిధంగా తయారవుతారని. ఇప్పటి ప్రభుత్వ వ్యవస్థ, సామాజిక వ్యవస్థ కూడా ఆ రకమైన ప్రవర్తనని సమర్థిస్తుంది. ఈ రోజు కుటుంబ వ్యవస్థలో అన్నీ తల్లిదండ్రులే చూడాలి. చదువు, ఆరోగ్యం, ఉపాధి, వినోదం. ఇది తల్లిదండ్రులను నిరంతరం వేదనకి గురి చేస్తున్నది. ఎందుకంటే అవన్నీ సమకూర్చే ఆర్థిక స్థోమత వారికీ వుండటం లేదు, అవి కల్పించక పోతే వారు ఎందుకూ పనికి రారన్న భయంతో వారికి వచ్చే కొద్దిపాటి ఆదాయం పిల్లల కోసం ఖర్చు పెట్టేటట్లు చేస్తున్నది. పిల్లల పైన వత్తిడిని పెంచుతున్నది. చదువు తప్ప బతకడానికి వేరే మార్గం లేదు అన్న భయం వారిని వెంటాడు తున్నది. ఇంకొక వైపు పిల్లలు ఏమి చేయాలనేది తల్లిదండ్రుల చేతిలోనే ఉంటున్నది. ప్రతి దానికోసం తల్లిదండ్రుల మీదే ఆధారపడాల్సిన పరిస్థితి. పిల్లలు వారి మనోభా వాలు ప్రధానమైనవిగా వుండటం లేదు. సమాజం, ప్రభుత్వం తోడ్పాటు సరిగ్గా ఉండటం లేదు.

చాలామంది తల్లిదండ్రులు పిల్లలు ఎదిగాక తమ ఆకాంక్షలకు తగ్గట్టు పెరగలేకపోతున్నారనే ఆందోళనలో పడుతుంటారు. బలవంతంగా పిల్లల ఇష్టాయిష్టాలను మార్చే దారుణ దిద్దుబాటు కార్యక్రమాన్ని కటువుగా పాటిస్తుంటారు. పిల్లల అభిరుచుల కన్నా తమ ఆలోచనలనే సమర్థించుకుంటారు. ఏ కొద్ది మందినో చూపించి వారిలా గొప్పగా చదవాలి, క్రీడల్లో రాణించాలి, ర్యాంకులు తెచ్చుకోవాలి అని నిరంతరం పిల్లల పైన వత్తిడి తెస్తుంటారు. అందుకు వారికి చేతనైన డబ్బు ఖర్చు పెడుతుంటారు. ఐనా గానీ పిల్లలు పెద్ద అయ్యాక నిజాయితీగా వుండలేకరు, మంచి మర్యాదలు తెలీవు, మంచి పనిమంతులుగా అవ్వలేరు. ఓ రకంగా తల్లిదండ్రుల పెంపకమే ఆశబోతులుగా, పిసినారులుగా మారుస్తోంది. మొత్తం మన కుటుంబ వ్యవస్థే అలా వుండటం వలన బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ఈ గొలుసు కొనసాగుతున్నది.

సామాజిక సంబంధాలు

కుటుంబానికి సంబంధించిన వ్యవహారాలు సమాజం నుంచి వేరుగా చూడలేము. మీరు ఇంట్లో కానీ, పనిచేసే చోటకాని ఏమి చేస్తుంటారనేది మీ కుటుంబంలో ప్రతిఫలిస్తుంటుంది. కుటుంబంలోని వారు సామాజికంగానూ, రాజకీయంగానూ మంచి స్పృహ కలిగిన వ్యక్తిగానే చూడగలగాలి. అయితే పిల్లలేం చేస్తుంటారనేది చూస్తుండటం తల్లిదండ్రులకు అవసరమే అయినా పిల్లలు సమాజంలోని అనేక రకాల ఒత్తిడులను తట్టుకోగలిగే విధంగా ఎదగటంలో స్వేచ్ఛ ఉండాలి. తల్లిదండ్రులే సమాజంలోని అన్ని దుష్ప్రభావాల నుండి బిడ్డను కాపాడగలమని అనుకోవద్దు. ఎందుకంటే జీవితంలో వాళ్ళు తరువాత దశలలో అనేక రకాల ప్రజల్ని, పరిస్థితుల్ని ఎదుర్కోవలసి ఉంటుంది. అందుకు అనుగుణంగా వారికి అన్ని రకాల సాధక బాధకాలు వివరించాలి.

పిల్లలకు సహాయం, తోడ్పాటు అందుతూనే ఉండాలి. కుటుంబంతో పాటు దానిని వాళ్ళు అనేక రూపాలలో

వ్యక్తుల ద్వారా సంస్థల ద్వారా పొందుతారు. పిల్లలతో మనం గడిపే సమయాన్ని సద్వినియోగం చేసుకోవటమే అసలైన విషయం. పిల్లలు ఎదిగేకొద్దీ తమ తల్లిదండ్రులు ఏమి చేస్తుంటారు, వారి పని తీరుతెన్నులేంటి, వారున్న సామాజిక పరిస్థితులేమిటి అనేవి తెలుసుకోవటానికి ఉత్సుకత చూపుతారు. పిల్లలు తమ తల్లిదండ్రులు చేసే పనిని మొత్తం సమాజానికి ఉపయోగించేదిగానూ, సమాజంలో భాగంగానూ చూసేట్టుగా వుండటం చాలా ముఖ్యం. తమ తల్లిదండ్రులు చేసే పనిని అర్థం చేసుకుని విలువనిచ్చే వారిగా పిల్లలు ఎదగాలి. వివిధ

వారివీ హక్కులే...

పిల్లలు సహజంగా వారి కుటుంబాలకు అనుసంధానించబడి వుంటారు. కుటుంబంలో వుండే పేదరికం, వలసలు, అనారోగ్యం, ఆకలి వీరిని వేధిస్తాయి. అది మానవ హక్కుల ఉల్లంఘనే. బాలల హక్కులు అనేక విధాలుగా ఉల్లంఘించబడుతున్నాయి. బాల కార్మికులు, పౌష్టికాహార లోపం, బాలలపై హింస, బాల్య వివాహాలు, లైంగిక దాడులు వీటిలో కొన్ని మాత్రమే. వీటన్నింటినీ నిర్మూలించడానికి బదులు ప్రభుత్వాలు ఇవి మరింత పెరిగే విధానాలను అనుసరిస్తున్నాయి. ఉదా: అంగన్వాడి కార్యక్రమం బలహీనపరచడం, జాతీయ ఉపాధిని నీరుగార్చడం వంటివి. ఇవన్నీ దాటి ప్రస్తుతం చదువుకుంటున్న బాలలు కొత్త సమస్యలను ఎదుర్కొంటున్నారు.

రంగాల మహా నాయకుల గురించి పిల్లలు తెలుసుకోవాలి. తమ తల్లిదండ్రులు ఆ మహానాయకుల అడుగుజాడల్లో వెళ్తున్నట్టుగా గమనించగలగాలి. తమ తల్లిదండ్రులకు సంబంధించిన విజయాలను పిల్లలు గుర్తించగలగాలి.

ఎలా పెంచాలి

ఇప్పుడు పిల్లలు చూపాల్సిన క్రమశిక్షణ చాలా సంక్లిష్టంగా ఉంటోంది. ఏ పని అయినా ఎందుకు చేయాలి అనేది అవగాహన చేసుకోవటమే కాక ఆ పనిని తనకి కుదిరిన అత్యున్నత పద్ధతిలో, అతి చురుకుగా చెయ్యాల్సి ఉంటుంది. అంతే కాదు పిల్లలు తమ చురుకుదనం, చొరవ చూపిస్తూ, అనుక్షణం ఆదేశాల గురించి ఎదురుచూడకుండా, తమ విధుల్ని సక్రమంగా నిర్వర్తించటం, అందుకనువుగా బాల్యం నుంచి సిద్ధమవటం అవసరం.

ఆటపాటలతో చురుగ్గా...

పిల్లలు చిన్నప్పుడు ఆటపాటలతో ఏ విధంగా ఉల్లాసంగా ఉంటారో పెద్దయ్యాక కూడా పనిని అలాగే చేసే వాతావరణం ఉండాలి. వాస్తవానికి పనికి, ఆటపాటలకి మధ్య పెద్ద తేడాలేదు. మంచి ఆటపాటలు మంచి పనితీరు వంటివి. అలాగే మంచిదికాని ఆట పనికిరాని పని వంటిది. మంచి ఆట అంటే శారీరకంగాను, మానసికంగానూ వికాసాన్నివ్వాల్సింది. పిల్లలకు మీరు ఒక కీ తిప్పే అటవస్తువో లేదా కంప్యూటర్ మీటల మీద పనిచేసే అటవస్తువో ఇస్తే రోజంతా పనిచేసేటట్టు మీరే చూసుకోవాలి. బిడ్డ దానివంక చూడొచ్చు, దానితో కొంత ఆటలు అడవచ్చు కూడా, కానీ పెద్ద

ఉపయోగం ఉండదు. కానీ, ఏమంత చురుకుగా అయ్యే అవకాశం ఉండదు. ఈ రకమైన ఆట వస్తువులతో బిడ్డ ఎదిగినట్లయితే కష్టనష్టాలను ఓర్చుకోలేని విధంగా, కొత్త పనులను అందుకోలేని విధంగానూ, కొత్త ఆవిష్కరణలను చేయలేని విధంగానూ ఎదుగుతారు. ప్రయత్నంలేని,



చురుకుదనం కల్పించని ఆటపాటలు మంచివి కావు. ఈ విధంగా చెప్పాలంటే ఆటపాటలు కూడా మన పని వంటివే. ఆటపాటలు పిల్లలకు సంతోషాన్ని కలుగజేయాలి. ఆ రకమైన సంతోషం సృజనాత్మకమైన సంతోషం అవుతుంది. మానవుడు వస్తువులనూ, వస్తువుల ఉత్పత్తితో, సాంస్కృతిక సామాజిక విలువలలో నిమగ్నమైన సామాజిక ఉత్పత్తిలో పాలుపంచుకోవటమనేది పని. ఆటపాటలనేవి సామాజిక లక్ష్యాలలో పరోక్ష సంబంధాన్ని కలిగివుంటాయి.

సమగ్రంగా ఎదగాలి

ఒక క్రమశిక్షణ గల పౌరుడు తాను నేర్చుకొన్న విద్య, సామాజిక పరిజ్ఞానం, తాను చదివిన పుస్తకాలూ, పత్రికలు, తాను చేసే పని, తన ఆటపాటలు, తన సామాజిక కార్యక్రమాలు, ఇత్యాదుల సమగ్ర చిత్రంగా అబివృద్ధి చెందుతాడు. అంతేకాదు అతను విశ్రాంతి తీసుకోవటంలో కూడా అతని క్రమశిక్షణ ద్యోతకం అవుతుంది.

సామూహికంగా..

పిల్లలలో కొంతమందికి త్వరగాను, మరికొంతమందికి కొంచెం ఆలస్యంగానూ మిత్రులను ఏర్పరచుకోవటం, కలిసి ఆటలు ఆడుకోవటం వస్తాయి. మనం చెయ్యాల్సిందల్లా ఈ రకమైన కొంచెం కష్టమైన మార్పును బిడ్డ అలవాటు చేసుకొనేలా చేయటమే. పిల్లలు సమాజంలో భాగస్వాములు, పాఠశాలలో చదువు, ఆటపాటలలోనే కాక వారు ఒక సమగ్ర సామాజిక వ్యవస్థలో ఒక భాగం అవుతున్నారు. ఇప్పుడు చిన్నప్పటి ఆటపాటలు పెద్దయ్యాక ఆడే ఆటలకు మార్పుచెంది సామూహిక క్రమశిక్షణ అనేది ఏర్పడుతుంది. అటువంటి క్రమశిక్షణ నేటి విద్యా వ్యవస్థ కానీ, పాఠశాల కానీ అందించడం లేదు. పిల్లలకి ఆటలే కాదు, వారు ఇంకా ఇతర రకాలైన కార్యకలాపాలలో కూడా అభివృద్ధి చెందాలని చెప్పి, వారికి అర్థమయ్యేలా చేయడంలేదు. వారికి వ్యక్తిగత విజయాలలోనే కాక సామూహికంగాను, సామాజికంగా కూడా విజయాలు సాధించాల్సిన అవసరాన్ని తెలియచేసి ఉత్తేజపర్చాలి. ఓటమైనా గెలుపైనా ప్రశాంతంగా స్వీకరించేలా నేర్పాలి. ఈ దశలో పిల్లలపై మిత్రులు, అతని సమూహంలోని వారు, అతని ఆటల సంఘంలోని వారి ప్రభావం వుంటుంది.

నైతిక జీవనం

పిల్లలు సామాజిక జీవులుగా ఎదిగే క్రమంలో, మానవ సంబంధాలు పెరిగి, ఆ సంబంధాలలో భాగంగా సూత్రబద్ధమయిన నైతిక జీవనాన్ని అభ్రివద్ధి చేస్తాయి. ఆ నైతికత లైంగిక జీవనంపై అవగాహన కల్పిస్తుంది. అయితే అణగదొక్కే స్వార్థ సమాజంలో, నైతిక సూత్రాలకు తరచూ తిలోదకాలిచ్చేస్తారు. అలాంటి సమాజంలో భాగమయిన కుటుంబ విధానంలోకి కూడా ఆ లోపాలు విస్తరిస్తుంటాయి. తదనుగుణంగానే పురుషాధిపత్యమున్న కుటుంబవ్యవస్థలో మహిళల స్థితిగతులలో ఇవి కనబడుతుంటాయి. మహిళలను, భౌతిక ఆనందం కలిగించే వస్తువుల లాగా చూడటం జరుగుతోంది. వ్యభిచారంలో మహిళల శరీరాలను డబ్బుతో కొనటమనేది జరుగు తోంది. ఇష్టంలేని పరిస్థితులలో కూడా, భార్యా భర్తలు విధిలేక కలసి ఉండటాన్ని కూడా మనం చూస్తుంటాం. మానవ లైంగిక జీవనంలో రావల సిన ఆదర్శ ప్రాయమయిన మార్పులు చిన్నప్పటి నుండే వారికి అవగాహన కల్పించడం ద్వారా సాధ్యమవుతుంది.

నిజాయితీ, సత్ప్రవర్తన, సత్యవర్తన, సూటి మనస్తత్వం, శుభ్రమైన అలవాట్లు, కష్టపడి పని చేసే లక్షణం, నిజం చెప్పే లక్షణం, అన్నిటికి మించి, ఇతరులను గౌరవించే లక్షణం ఇవన్నీ వారిలో కావాలి. ఇతరుల అనుభవాన్ని, వారి అవసరాలను గుర్తెరిగే లక్షణం కావాలి. దేశభక్తి, సమానత్వ లక్షణాలు గల సమాజం అనే ఆలోచనలు వారిలో పెంపొందాలి. ఇవన్నీ సక్రమంగా అభివృద్ధి చెందే దోవలో మనం పిల్లలను తీసుకువెళ్తే, లైంగిక పరిజ్ఞానంలో కూడా వారిని వైజ్ఞానికులను చేస్తున్నట్లే. రేపటి సమాజానికి మంచి భార్యను, లేక మంచి భర్తను మంచి వ్యక్తిని తయారుచేస్తుంది.

కథలు చెప్పండి

మంచి పుస్తకాలు చదవటం, దినపత్రికలు చదవటం, మంచి సినిమాలకు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరవటం వంటివి తల్లిదండ్రుల సాధారణ దినచర్యలో భాగంగా ఉన్నట్లయితే తల్లిదండ్రులు వేరే సాంస్కృతిక అభివృద్ధి గురించి ఆలోచించక్కరలేదు, పిల్లలకు సహజంగానే అలవాటవుతుంది. పిల్లలకు సాంస్కృతిక అభివృద్ధి అనేది చాలా చిన్నప్పటి నుంచే మొదలవ్వాలి. వారు విషయాలని గ్రహించటం, పరిశీలించటం, మాట్లాడటం మొదలుపెట్టిన దశ నుంచి ఈ అభివృద్ధి ఉండాలి. చిన్నప్పుడే చక్కటి కథలు

లోకం విప్పాలి

వ్యక్తులు వ్యక్తులుగా మాత్రమే కాక అందరితో కలసిమెలిసి సమాజంలో భాగంగా ఇమిడిపోవటమే దాని అర్థం. కొన్ని కుటుంబాల్లో ఈ రకమైన శ్రద్ధ లేకపోవటంతో పిల్లలు స్వీయ మానసిక వ్యక్తిత్వ ధోరణులతో పెరుగుతారు. పిల్లలకు చిన్నప్పటి నుంచి కుటుంబానికి కావలసినవి ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఎలా వస్తున్నాయి అనేది మనం తెలియజెప్పాలి. లేకపోతే అలాంటి పిల్లలు మిగతా కుటుంబ సభ్యుల అవసరాలను గుర్తించి, తన అవసరాలను వాటితో సమన్వయం చేసుకోకుండా పెరుగుతున్నట్లయితే ఆ బిడ్డ తన కుటుంబాన్ని సమాజంలో భాగంగా ఎంచదు. దీనివల్ల ఆ బిడ్డ అన్నీ కావాలనుకొంటూ ఆశపోతులాగా ఎదిగి స్వీయమానసిక దృక్పథంతో పెరుగుతాడు. ఇలాంటి బిడ్డ తనకి హాని చేసుకొనే అవకాశం ఉంది. అంతేకాక సమాజానికి కూడా హానికరంగా తయారవుతాడు. పిల్లలకు తమ తల్లిదండ్రులు తెచ్చే డబ్బు కేవలం కుటుంబానికి ఉపయోగించేదవ టమే కాక, వారు చేసే పని కూడా సామాజికంగా ఉపయోగిస్తుందనేది తెలియచెప్పాలి. బిడ్డ ఎదిగేకొద్ది పిల్లలకు దేశంలో వివిధ ప్రాంతాలలో వున్న ఫ్యాక్టరీలు, ప్రాజెక్టులు, పాడిపంటల గురించి తెలియచెప్పాలి. ఎంతో కొంత కుదిరినంతమేర పిల్లలకి ఆ ఫ్యాక్టరీలు, ఆఫీసులు ఇలాంటివి చూపించి అక్కడ ఉత్పత్తి విధానం ఎలా వుంటుందో చెబుతూ ఉండాలి. సమాజంలో పెద్ద పిల్లలకు పనీపాటా తెలియకుండా పెరగటం ఊహించలేము. పనిచేయటమనేది మానవ జీవితానికి మూలాధారం. అదే మనిషి సంతోషంగా ఉండటానికి, సాంస్కృతికంగా ఎదగటానికి మూలం.

పిల్లలు సమాజంలో ఒక భాగంగా ఎదిగేటప్పుడు, సమాజంలో అతని పాత్ర ఎంతోకొంత ఉండాలని, దేశ పౌరుడిగా దేశాభివృద్ధికి తోడ్పడేదానికి అతని కృషి కూడా ఉండాలని, ఆవిధంగా అభివృద్ధి చెందటానికి వాళ్ళని సంసిద్ధం చేయాలి. ప్రకృతిలో మనుషులందరూ ఒకే విధంగా పనిచేయగలిగిన శక్తితో ఉంటారు. కాని బాగా పనిచేయగలిగినవాళ్ళు కొందరుంటే, అంతగా పనిచేయలేక చిన్నచిన్న పనులతో సరిపుచ్చుకొనే వాళ్ళు కొందరుంటారు. ఇంకొందరైతే ఎంతటి క్లిష్టమైన పనినయినా సునాయాసంగా చేస్తారు. ఈ విధమైన తేడాలన్నీ ప్రకృతి సహజంగా వచ్చినవి కావు. పుట్టినప్పటి నుంచి ఎదిగే దశలలో, ముఖ్యంగా యవ్వన దశలో ఈ తేడాలు వస్తాయి. కాబట్టి పనిచేయటానికి సిద్ధం చేయటమనేది భవిష్యత్తు జీవన ప్రమాణాన్ని అభివృద్ధి చేయటానికి, చక్కని జీవనాన్ని పెంపొందించటానికి అవసరం.

చెప్పినట్లయితే, వారి సాంస్కృతిక అభివృద్ధి అక్కడే మొదలవుతుంది. ప్రతీ కుటుంబంలోనూ కథల పుస్తకాల సమీకరణ అనేది కొంతమేరకైనా ఉంటే మంచిది. తల్లిదండ్రులు తమ బాల్యంలోనూ, కౌమార దశలోను చాలా కథలు వినివుండవచ్చు. ఏ రకమైన కథలు ఎంచుతున్నాము అనేది చాలా ముఖ్యం. పూర్తిగా చక్కిటి పురాణాలు, దయ్యాలు, భూతాల కథలు, పిల్లల్లో హింసను ప్రేరేపించి దుష్టత్వం వైపు మళ్ళించే కథలు ఉండకుండా చూడాలి. మరీ చిన్నపిల్లలకి జంతువులు వాటికి సంబంధించిన కథలు చక్కగా ఉంటాయి. సాధారణంగా పిల్లల్లో వారి శక్తియుక్తుల గురించి విశ్వాసం, భవిష్యత్తు గురించి ఆశావహ దృక్పథం, చురుకుదనం కలిగించగలిగిన కథలు వినిపించటం మంచిది.

తల్లిదండ్రులు పిల్లలతో వారి భవిషత్తు కార్యక్రమాల గురించి చర్చించి వారు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్ళేలా చేయాలి. పుస్తకాలూ, పేపర్లు చదవటం, సినిమాలు, రంగస్థల ప్రదర్శనలు ఇలాంటివన్నీ ఈ ప్రణాళికలో ఒక భాగం. సాంస్కృతిక అభివృద్ధిలో పిల్లలకి ఆసక్తికరమైనదిగా ఉండాలంటే తల్లిదండ్రులలో తగినంత ఆలోచన ఉండాలి. వయసు పెరిగేకొద్దీ పిల్లలు ఫోటోలు, వార్తపత్రికల ముక్కలు ఇలాంటి వాటి నుండి ఏ విషయానికా విషయం ఆల్బమ్స్ తయారుచేయటం నేర్చుకోవాలి. ఏ పని చేసినా, ఆ పని వారిని సాంస్కృ తిక, రాజకీయ కార్యాచరణలో ముందుకు తీసుకెళ్ళేదిగా ఉండాలి. పిల్లలు కాలం గడుస్తున్నకొద్దీ తమ దేశానికీ, ప్రజలకు శత్రువులెవరు? మిత్రులెవరు? ప్రజల కోసం పని చేస్తున్న త్యాగధనులెవ్వరు అనేది తెలుసుకొని దేశభక్తియుత పౌరులుగా ఎదగాలి.

ఇవన్నీ ఎవరు చేయాలి?

పిల్లలకి ఇవన్నీ అందించే యంత్రాంగం, వ్యవస్థ వుండాలి. ఇప్పుడున్న సమాజం అది కల్పించడం లేదు. అటువంటప్పుడు పిల్లలు ఆరోగ్యంగా, విజ్ఞానవంతంగా, చురుగ్గా, ధైర్యంగా ఎలా ఎదుగుతారు? ఆ ఆశ అత్యాశ కాదా? మనం కానీ ప్రభుత్వం కానీ వారికి అవసరమైన వాతావరణం కల్పించకుండా వారి నుంచి మాత్రం ఇవి ఆశించడం ఎంతవరకు సమంజసం? మరి ఈ పని ఎవరు చేస్తారు? ఎవరూ చెయ్యక పోతే భారత దేశంలో బాలలు ఎంత ప్రమాదం లో పడతారో ఊహించగలరా? శ్రీశ్రీ అన్నట్టుగా కొంతమంది యువకులు పావన నవజీవన నిర్మాతలుగా ఎదుగగలరా? అందుకు భిన్నమైన పరిస్థితి నేడు స్పష్టంగా కనబడుతున్నది.

ఆర్థిక అసమానతలు తీవ్రంగా వున్న సమాజంలో అందరికీ సమాన అవకాశాలు వుండవు. ఒక కార్మికుడు సమాన పనికి సమాన వేతనం కోసం యూనియన్ పెట్టుకుంటాడు. వేతనం పెంచే వరకు, న్యాయం జరిగే వరకు పోరాడుతాడు. మరి మన దేశ జనాభాలో 37 శాతంగా వున్న బాలలు ఆకలితో, అనారోగ్యంతో, సామాజిక రుగ్మతలతో బాధపడుతుంటే వారి గురించి ఎవరు లాబీ చేస్తారు? ఎవరు పని చేస్తారు? పెద్దలే వారి పక్షం వహించాలి. వర్గ సమాజంలో కార్మికుడు దోపిడీకి గురి ఐనట్లే అదే సమాజంలో ధనిక, పేద బాలల మధ్యన వ్యత్యాసాలు వుంటాయి. ధనికులకనువైన విధానాలు పేదబాలల్ని అన్నింటికీ దూరం చేస్తున్నాయి. ఉద్యోగులు, కార్మికులు, యువజనులు, విద్యార్థులు, మహిళలు ఎవరి సమస్యల పైన వారు పని చేసుకుంటారు. మరి బాలల కోసం, వారి హక్కుల కోసం, వికాసం కోసం వీరంతా కలిసి పని చెయ్యాలి.

తేడాలు నాటొద్దు

సమాజం వారికి బాల్యం నుంచి నేర్పిస్తున్నది ఏమిటి? పేద గొప్ప తేడా, కులం మతం తేడా, రంగు రూపం తేడా, జాతుల తేడా, స్త్రీ పురుషుల తేడా. అవినీతి, అశ్లీలం, హింస, మూఢత్వం, ఛాందసత్వం ఇవన్నీ ఎవరి ప్రమేయం లేకుండా ఓ ప్రాయోజిత కార్యక్రమంలా నిరంతరం అనుభవంలోకి వస్తున్నాయి. ఇటువంటప్పుడు దీనికి ప్రత్యామ్నాయం చూపించే బాధ్యత ఎవరు తీసుకోవాలి? ఛాందస వాదులకి ఆ అవసరం లేదు. వారు సమాజం ఇలాగే వుండాలని కోరుకుంటున్నారు. మరి ఆ పని చెయ్యవలసినది సమాజ మార్పు కోరుకొనేవారు, అభ్యుదయ కాముకులు. పిల్లలకి ఇవన్నీ చెయ్యడం నేటి కుటుంబంలో సాధ్యం కాదు. తల్లిదండ్రులు ఇద్దరూ పనికి వెళ్ళడం లేదా చదువు ఒక్కటే బిడ్డలకి తెలియాలన్న భ్రమలు వారిని పిల్లల పట్ల హేతుబద్ధంగా వుంచడం లేదు. పిల్లల కోసం ఆ పని చెయ్యడానికి అనేక వేదికలు కావాలి.

దీనిని ఎవరో ఒకరు ఎక్కడో ఒక చోట ప్రారంభించాలి. వాడవాడలా గ్రామ గ్రామాన దేశమంతాటా విస్తరించాలి. అప్పుడే భావి భారత పౌరులే కాదు సమాజ మార్పుకు చోదకులు తయారవుతారు. పిల్లల వినోదం, విజ్ఞానం, వికాసం కోసం చేసే ఏ చిరు ప్రయత్నమైనా అభినందనీయమే.



హైనాతో స్నేహం

పులిని మాలిమి చేసుకోవచ్చు. సింహంతో స్నేహం మొదలెట్టొచ్చేమో గానీ హైనాలకు మాత్రం హాయ్ చెప్పలేమని అంటారు. అంత అపాయకరమైనవి అవి. ఈ మాట ఎక్కడైనా చెల్లుతుందేమో గానీ ఇథియోపియా తూర్పు ప్రాంతంలోని హరార్‌లో కాదు. ఇక్కడ మనిషికి హైనాకు ఎప్పటి నుంచో చెలిమి ఉంది. వందల ఏళ్ల నుంచి తరతరాలుగా దాన్ని కొనసాగిస్తున్నారు. వీటి బాగోగులు చూసుకునేందుకు 'హైనామెన్' అని తయారయ్యారు కూడా. రాత్రుళ్లు ఎక్కువగా సంచరించే హైనాలకు వీళ్లు మాంసాన్ని అడవుల్లోకి ఎదురెళ్లి అందిస్తారు. గ్రామాల్లోకి రాకుండా ఇలా జాగ్రత్త పడతారు. హైనా ఒకటి కనిపిస్తే ఏదో దూరంగా విసిరేయడం కాదు వాటి మందలోకి స్నేహితంగా వెళ్లి ప్రేమగా నోటికి అందిస్తారు. ఇది 1550 నుంచే మొదలైందట. హరార్ పట్టణాన్ని కట్టిన అప్పటి 42వ ఎమిర్ హైనాల కోసం ప్రత్యేకమైన కోట ద్వారాల్ని ఏర్పాటు చేశాడట. వీటి గుండా లోపలికి వచ్చే హైనాలకు మంచి ట్రీట్ ఇచ్చి తిరిగి పంపేవాళ్లు. ఆ ట్రీటేంటంటే మాంసం విక్రయశాలల్లో వృథా అయినవి. అలా పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకునేవాళ్లు. ఆ తర్వాత అక్కడ అతి తీవ్రమైన కరువు వచ్చింది. తినడానికి మనుషులకే ఆహారం ఉండేది కాదు. అడవి క్షీణించుకుపోవడంతో ఎక్కడ హైనాలు మనుషుల్ని పీక్కు తింటాయోనని వారికున్నా లేకున్నా పశుమాంసాన్ని అడవికే చేరి అందించి రావడం మొదలైంది. అలా అది ఇప్పటికీ కొనసాగుతోంది. హైనామెన్‌యే కాదు సాధారణ ప్రజలు కూడా ఓ ప్రత్యేక పండుగప్పుడు హైనాలకు విందు ఇస్తుంటారు. ఇది పర్యాటకంగాను మారింది.

నెల సినిమా

మీరు ఎంత ఇష్టమైన సినిమా అయినా ఎంత సేపుంటే చూస్తారు. మీ లెక్కల్లో మీరు ఉండండి మేం మాత్రం ఓ నెల రోజుల పాటు చూడాల్సిన సినిమా గురించి చెబుతాం. 'యాంబియెన్స్' అనే స్వీడిష్



సినిమాను దర్శకుడు యాండెర్స్ వెబెర్గ్ 720 గంటల నిడివిలో చిత్రీకరించాడు. 2020 నాటికి కెరీర్ నుంచి తప్పుకోవాలని చూస్తున్న యాండెర్స్ వెళ్లే లోపు ఏదైనా వండర్ చేయాలనుకుని ఈ పని చేశాడు. ఇంత పెద్ద సినిమాని 2020లో ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి ఒక్క ప్రదర్శనకు మాత్రమే విడుదల చేస్తారు. త్వరలో 72 నిమిషాల టీజర్‌ను వదలబోతున్నారు. ఇక ట్రైలర్ల మాటకొస్తే ఈ పాటికే 2014లో 7 నిమిషాలు, 2016లో 7 గంటల నిడివితో ఉంటే, వచ్చే ఏడాదిలో 72 గంటల నిడివితో విడుదల చేస్తారట. ఆ తర్వాత మళ్లీ ఇక ఎవ్వరూ చూడకుండా దీని కాపీలన్నింటినీ ధ్వంసం చేస్తారు. పోనీ అన్ని రోజుల పాటు చూసేంత మా గొప్పగా ఉంటుందా అంటే అదేం లేదని యాండెర్స్ తేల్చిపారేశాడు. అంతకు ముందు ఇదే కోవలోకి వచ్చిన 'మోడర్న్ టైమ్స్' (2011) 240 గంటల నిడివి రికార్డును బ్రేక్ చేయాలనేది ప్రయత్నం. మొత్తం వందమంది నటులున్న ఈ చిత్రంలో డైలాగులు కూడా ఉండవట. ఫ్రీగా టిక్కెట్ వచ్చినా చూడలేమంటారా... లేదా ఏదో ఉందని బ్లాక్‌లో అడ్వాన్స్‌ఆ కొనేసేవాళ్లూ ఉంటారా..!

వింత లోకం

గుడ్ మార్నింగ్ కుక్కపిల్లలూ..!

రేడియోలకు అతుక్కుపోయే ట్రెండ్ మళ్లీ మొదలైంది. ఎఫ్‌ఎంలలో గుడ్ మార్నింగ్ చెప్పించుకుని లేవడం... గుడ్ నైట్ చెప్పి నిద్రోడం ఇప్పుడు మళ్లీ అలవాటు అవుతోంది. అయితే ఈ గుడ్ మార్నింగ్ కుక్క పిల్లలూ! ఏంటనేనా. ఇది కేవలం శునకాల కోసమే వచ్చే రేడియో ప్రోగ్రామ్ 'హలో హాస్సో'. జర్మనీలోని ఓ ప్రాంతంలో ఇది కుక్కల మనస్సులను ఆకట్టుకుంటోందట. కేవలం వాటి కోసమే 24/7 నడిచే ఈ రేడియో స్టేషన్ రూపకర్త 30 ఏళ్ల స్టెఫాన్ స్టాక్కీ. తన పెంపుడు కుక్కకు ఇష్టమైన సంగీతమేదో తెలుసుకుని దాన్నే ఈ ప్రోగ్రామ్‌లో ప్లే చేస్తుంటారు. ఎలక్ట్రిక్ గిటార్, చిన్న డ్రమ్ము చేసే శబ్దాలను చెవులు రిక్కించి మరీ వినే కుక్క పిల్లలు రేడియోలకు అతుక్కుపోతున్నాయట. ఇది ఒంటరి కుక్కలకు బోర్ కొట్టకుండానే కాక అవి ఇంటిని చిందరవందర చేయకుండా కట్టడి చేయడానికి కూడా పనికొస్తుందని స్టాక్కీ అంటాడు. ఇది వింతగా ఉంటే మీరు శునకాల కోసమే నడుపుతోన్న డాగ్ టీవీ చానెల్ గురించి తెలిస్తే మరింత ఆశ్చర్యపోతారు.



తెలుసా

అణు ప్రమాదం అంచుల్లో...!



చరిత్రలో మొట్టమొదటి అణుబాంబు 'లిటిల్ బాయ్' జపాన్‌లోని హిరోషిమాపై పడి ఇప్పటికి 71 ఏళ్లు. 1945 ఆగస్ట్ 6న చోటుచేసుకున్న ఈ విధ్వంసం 70 వేల మందిని పొట్టనపెట్టుకుంటే కొన్ని వేలమంది రేడియేషన్ కారణంగా గాయపడ్డారు. ఇప్పటికీ ఆ విషపరిణామాలని అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్నారు. హిరోషిమా బాంబు దాడి విషాదకర పరిణామాల తర్వాత కూడా న్యూక్లియర్ టెస్ట్‌లు కొనసాగుతూనే వున్నాయి. మానవ మనుగడపై వినాశకరమైన ప్రభావాలను నివారించేందుకు అణుపరీక్షల తొలగింపుని ప్రోత్సహిస్తూ ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అణు పరీక్ష వ్యతిరేక దినోత్సవాన్ని ప్రవేశపెట్టింది.

● అన్ని రకాల అణుపరీక్షలకు ముగింపు చెప్పాలనే లక్ష్యంతో ఏర్పడిన సంస్థ కాంప్రహెన్సివ్ న్యూక్లియర్ టెస్ట్ బ్యాన్ ట్రియటీ. (సిటిబిటి). అణు ఆయుధాలని పరిమితం చేయడంతోపాటు వాటి వినియోగాన్ని నియంత్రించే లక్ష్యంతో పనిచేస్తోంది.

● సిటిబిటి అణుపరీక్షలని నిషేధిస్తూ ప్రవేశపెట్టిన ఒప్పందాన్ని ఇప్పటి వరకు 180 దేశాలు సంతకాలు చేశాయి. వీటిలో ఆమోదించబడిన దేశాలు 148.

● అమెరికా, చైనా, ఈజిప్ట్, ఇరాన్, ఇండియా, ఇస్రాయిల్, పాకిస్తాన్, డెమోక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా ఇంకా ఈ ఒప్పందాన్ని ఆమోదించాల్సి వుంది.



● అణు విస్ఫోటనాలు అధిక స్థాయి రేడియషన్లను విడుదల చేస్తాయి. అణువుల నుండి ఎలక్ట్రాన్లని వేరుచేయబడడం ద్వారా మన డిఎన్ఎలో ఎక్కువ లోపాలు కలిగిస్తాయి.

● అడవి జంతువులపై రేడియేషన్ ఎక్స్‌ప్లోజర్ ప్రభావంపై మొట్టమొదటి అధ్యయనాన్ని ఫుకుషిమా ప్రాంతంలోని కోతులపై 2012లో జరిగింది. జపాన్‌లోని ఇతర ప్రాంతాల్లోని కోతులతో పోలిస్తే ఇవి అతి తక్కువ తెలుపు, ఎర్ర రక్తకణాలని కలిగున్నాయని తేలింది.

● 2010లో జరిగిన అణువిధ్వంసం గురించి ఎక్కువమందికి తెలుసు అయితే ఎక్కువమందికి పట్టని విషయం భారత్‌లోని మయాపూర్‌లో చోటుచేసుకున్న ఒక అణు విధ్వంసం.



● ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన అణు విధ్వంసం 1986లో ఉక్రెయిన్‌లో చోటుచేసుకుంది.. ఈ విధ్వంసం తర్వాత 15వేల చ.మైళ్ళ మేర 300 ఏళ్ళ పాటు రేడియోధార్మిక కాలుష్యం వెలువడింది.

● వాషింగ్‌టన్‌లో అత్యధికంగా కలుషితమైన ఒక అణుకేంద్ర ప్రాంతం హ్యాన్‌ఫర్డ్ ఇప్పుడొక నేషనల్ పార్క్

● రేడియేషన్ లీక్‌ని మొదటగా జంతువులే గుర్తిస్తాయి.

● అణ్వాయుధాల నిరాయుధీకరణలో మొదటి అడుగుగా 1958లో బ్రిటన్ ప్రత్యక్ష కార్యాచరణ కమిటీ (డిఎసి) ఏర్పాటు చేయబడింది.

● 1979లో పెన్సిల్వేనియాలోని త్రీమైల్ ఐల్యాండ్‌లో అణు విద్యుత్ ప్లాంట్ ప్రమాదంలో 20 లక్షల మంది రేడియేషన్‌కి గురయ్యారనేది ఒక నివేదిక. ఈ ప్రభావం నుండి బైట పడేందుకు 14 ఏళ్ళు పట్టింది.

● చెర్నోబిల్ విధ్వంసం ద్వారా వెలువడిన వికిరణ శక్తి రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై పడిన అణుబాంబుల శక్తికంటే వంద రెట్లు ఎక్కువ.

● లాస్ వెగస్‌కి 107కి.మీ దూరంలోని నెవడాలో 3500 చ.కి మీటర్లలో మొత్తం 928 అణు పరీక్షలు నిర్వహించబడ్డాయి. 1951-92 మధ్య నిర్వహించిన ఈ అణుపరీక్షల ద్వారా అక్కడ భూమిలో సబ్‌స్టెన్స్ క్రాటర్స్ ఏర్పడ్డాయి. ప్రస్తుతం నెవడాలోని ఈ ప్రాంతం లోతైన గుంతలతో ఒక టూరిస్ట్ స్పాట్‌గా రూపుదిద్దుకుంది.

కులాన్ని కూల్చే సాహ

తెల

సినీ పరిశ్రమలో గొప్ప సినిమా
ప్రతిష్టాత్మక సంస్థల్లో ప్రసాద్ ఆర్ట్స్ ప్రొడక్ష
అనుమోలు సుబ్బారావు గారు నిర్మాత. నిర్మాత అనే
డిగ్నిటీని ఆపాదించుకున్న వ్యక్తి ఆయన. మానవ సంబంధ
మంచి అవగాహన వున్న వ్యక్తి. ముఖ్యంగా కుటుంబ వ్యవస
మక్కువ. ఏ చిత్రాన్ని ప్రేక్షకులకి అందించినా అది ఎంతో క
మంచి మార్పుని తేవాలి. తమని తాము తీర్చిదిద్దుకొనే
చేయాలి. ఇంటిల్లిపాదీ సుఖశాంతులతో ఉండాలన
వీరి లక్ష్యం.. ఆ లక్ష్యంతో నిర్మించిన చిత్రం
కులగోత్రాలు.

అక్కినేని నాగేశ్వరరావు, పి.ఏ.పి సుబ్బారావు గారికి విడదీయరాని అవినాభావ సంబంధం. ఇద్దరూ విజయం కోసం శ్రమించారు. విజేతలయ్యారు. ఈ సంస్థలో తర్ఫీదైన సహాయ దర్శకులే తదనంతరం దర్శకులుగా ఎదిగి ప్రేక్షకులకు గుర్తుండిపోయే సినిమాల్ని అందించారు. వీరిలో మొట్టమొదటి వ్యక్తి దర్శకుడు కె.ప్రత్యగాత్మ. ఆయన ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిన చిత్రమే కులగోత్రాలు!

దర్శకుడి నేపథ్యం

ప్రత్యగాత్మ గారు మంచి వితరణగల జర్నలిస్టు. ఆపై తాతినేని ప్రకాశరావు గారు. విక్టరీ మదుసూధనరావుగారు ప్రత్యగాత్మ వీరంతా వామపక్షభావాలతో ఎదిగి కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులైన వ్యక్తులు. తర్వాత సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ప్రత్యగాత్మగారికి సినిమా మెళకువలు బాగా తెలుసు. సమకాలీన సమస్యలపై మంచి అవగాహనతో తనదైన పరిష్కారాన్ని అందించగలరు. వాటిని సెల్యులాయిడ్ మీద మలచడంలో మంచి పట్టువుంది.కులాల మధ్య కుమ్ములాటలూ, కులాల పట్టింపులూ ఎక్కువగా ఉండేవి. "కులాలూ, గోత్రాలూ అంటూ మనుషుల మధ్య ఈ గొడవేమిటి? దీనికో అందమైన పరిష్కారాన్ని అందించలేమా? అందరూ మనుషులే కదా.. వారికీ మనసుంటుంది కదా... పరిస్థితులు వారిని ఒకటి చేస్తే వారికి భార్యా భర్తలుగా మనగలిగే అవకాశమే లేదా?" ఈ ఆలోచనల్లోంచి ఆవిర్భవించిన చిత్రమే "కులగోత్రాలు"! ప్రత్యగాత్మగారి ఈ ఆలోచనకి ఒక లైను ట్రీట్‌మెంట్ రాయడం జరిగింది. కథ ఇలా ఉండాలని తెలుసుగాని.. ఎలా కథనం సాంగిచాలనేదానికి రచయితల సహకారం అవసరం!

'కథ' కమామిషూ..

1962 అప్పటికే జర్నలిజంలో ఆరితేరి...బుడుగులా ప్రవేశించి పిడుగు అనిపించుకున్న వాడు ముళ్ళపూడి వెంకటరమణ. రక్త సంబంధం, దాగుడుమూతలు సినిమాలతో బిజీగావున్న 'రమణ'ని పిలిపించి కథ మీద కూర్చున్నారు. సినిమా నడక, సినిమాలో అదనపు ఆకర్షణలూ.. మెలోడ్రామా తదితర విషయాల్లో ఇద్దరిదీ ఒక ప్రత్యేకమైన మైత్రి. వైవిధ్యంగా వుంటుంది. తనధోరణిలో స్క్రిప్ట్ అందంగా మలిచాడు. కథ బాగుంది. కథలో పాత్రలూ.. వాటి మధ్య ఘర్షణ మానవ సంబంధాల్లోని మాధుర్యం అందమైన కదంబంలా రూపుదిద్దుకున్నాయి. ఏదో కావాలి. ఇంకాస్త సాన పడితే బావుంటుందన్న ఆలోచన ప్రత్యగాత్మగారిది. అయితే రమణ గారి కమిట్‌మెంట్స్ ప్రతిబంధకంగా మారాయి. ఆ సమయంలో సుప్రసిద్ధ నాటక రచయిత రావికొండలరావు కంట్రిబ్యూషన్ అవసరం పడింది. స్క్రిప్ట్ తృప్తికరంగా అనిపించింది. ఇది ఒక విప్లవాత్మకమైన పాయింట్. దీనికి సంగీత సాహిత్యాలు జత కుదరాలి. ఆపాత మధురాలు అందించాలి.



పాటలన్నీ తేనెతోరలే...

మంచి పాటలు రాయగలిగిన వ్యక్తి ఇంకెవరుంటారు రాజేశ్వరరావు గార్ని పిలిపించారు. మ్యూజిక్ సిటింగ్స్ పి.ఏ.పి ఆఫీసులోనే.. ఈ సినిమాకి ముగ్గురే గీత రచయితలు. సి నారాయణరెడ్డి, కొసరాజు. ఒక పాట శ్రీశ్రీ రాశారు. ఎక్కువ పాటలు కొసరాజు రాశారు. కొసరాజుగారి గురించి రెండు మాటలు చెప్పాలి. తెలుగుభాష మీద, జానపదాల మీద ముఖ్యంగా వాటిని సంగీత పరం చేసే ఆవిష్కరణ మీద గొప్ప పట్టుంది. అందుకే ఆయన రాసిన పాటలన్నీ పూర్ణాయుష్షు అందుకున్నాయి. పేకాట రాయుళ్ళు ఇల్లూ పెళ్ళాంని మరిచిపోయి దొంగతనంగా చీట్లపేకాడి సర్వస్వం కోల్పోయి నెత్తిన కొంగేసుకున్న వారి కోసం రాసిన పాట 'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే... అయ్యయో జేబులు ఖాళీ ఆయేనే...'. చీట్లపేక బలహీనతకి అద్దం పట్టినట్లుండే ఈ పాటలోని సాహిత్యం ఇప్పటికే నిత్య నూతనం. మాధవపెద్ది సత్యం బృందం పాడారు. ఈ పాటని రేలంగి, రమణారెడ్డి, బొడ్డపాటి బృందంపై చిత్రీకరించారు. "చింపికనుల తీయని చెలికాడ... నీ నీడను నిలుపుకొందురా వెల్లుల మేడ...", 'చెలికాడు నిన్నె రమ్మని పిలువా... చేర రావేలా ఇంక సిగ్గేలా...' పాటలు నారాయణ రెడ్డిగారు రాయగా సుశీల, ఘంటసాల గళాలతో మధురిమలద్దారు. 'మామ శత్రు భయంకర నామా, అందానికి చందమామా' మామగారి మూర్తిత్వం మీద రాసిన పద్యం. మాధవపెద్ది, పిఠాపురం పంచుకున్నారు. అలాగే 'రావయ్యా

మరోగీతం 'నీ నల్లని జడలో పూ
జమునారాణి, పిఠాపురం పాడగా
చిత్రీకరించారు. ఒక్కపాట మాత్ర
నృత్యగీతం. ఈ పాటలోనే మొట్ట
పాట తీసుకున్న సాహిత్యపరంగా
మనసుని దోచుకున్నాయి. అవి

చిత్ర కథ

కామందు భూషయ్య (గువ
విశాఖపట్నంలో చదువుకుంటూ
(కృష్ణకుమారి) ఎం.బి.బి.ఎస్ చద
కాంతమ్మ జి.వరలక్ష్మితో కలిసి జీ
పెళ్ళి సంబంధాలు చూస్తుంది గా
బయటికి కాంతమ్మ చెప్పదు గను
వుంటాయి. వరద బాధితుల సహ
కార్యక్రమంలో రవి, సరోజలు ఓ
అక్కడ్నించి సరోజ ఇంటికి వెళుత
హారాన్ని దొంగిలించపోతే రవి అ
చలపతిని పోలీసులు తరుముకు
ఇంట్లో ప్రవేశిస్తాడు. కాంతమ్మని

...సం

ఆపాత చిత్రం



...గు
...ందించిన
...ప్స ఒకటి.
...దానికి ఓ
...ాల మీద
... మీద
...త

మా ఇంటికి రమ్మంటే రావేల మాయింటికి' ఈ జానపద గీతాన్ని కొసరాజు రాశారు. మరో సరదా స్టైలిష్‌పాట కూడా కొసరాజు ఆవిష్కరించారు. 'రావె రావె బాల.. హలో మైడియర్ బాల ఇటు రావే... ఇటు రావే ఐ లవ్ యూ' ఈ పాటని ఆరుద్ర గారు రాశారనుకుంటారు. కానీ కొసరాజు గారే రాశారు. ' జానపద బాణీలు సాగినపాట ...క్కినేని, కృష్ణకుమారి మీద ...శ్రీశ్రీ రాశారు. 'సుషీ శకుంతల' ...మొదట రాజబాబు కనిపిస్తాడు. ఏ ...సంగీతపరంగా ప్రేక్షకుల ...ప్పటికీ ఆపాత మధురాలే!

...్మడి) కొడుకు రవి (అక్కినేని) ...ుంటాడు. అదే వూళ్లో సరోజ ...వుకుంటూ వుంటుంది. తల్లి ...స్తూ వుంటుంది. సరోజ కోసం ...ి ఆమె తండ్రి ఎవరో తెలీదు. ...క ఆ సంబంధాలన్ని తప్పిపోతూ ...యార్థం ఓ సాంస్కృతిక ...నృత్యనాటిక ప్రదర్శిస్తారు. ...ండగా చలపతి అనే దొంగ తన ...ష్టకొని గాయాల పాలవుతాడు. ...వస్తూంటే తప్పించుకొని కాంతమ్మ ...చలపతి మోసం చేసి అష్టకష్టాలపాలు చేస్తాడు. ఈ విషయం కూతురికి తెలియకూడదని కాంతమ్మ భర్తని హెచ్చరించి పంపించేస్తుంది. రవి సరోజ కాలేజీ వార్షికోత్సవంలో శకుంతల – దుష్యంతుల నృత్య నాటకం వేస్తారు. ప్రేమలో పడతారు.

'కులగోత్రాల' పట్టింపు గల భూషయ్య వారి ప్రేమను అంగీకరించడు. రవి సరోజకి అన్యాయం చేయడం ఇష్టం లేక గుళ్లో పెళ్లి చేసుకుంటాడు. కాంతమ్మ తీర్థయాత్రలకు వెళ్ళిపోతుంది. రవికి పోలీసు ఇన్‌స్పెక్టర్ వుద్యోగం వస్తుంది. రవి కులగోత్రాలు లేని అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడని తన చెల్లెలు పెళ్ళి అగిపోతుంది. ఆ సమయానికి వరుసకి బావ అయిన జోగారావు పద్మనాభం పెళ్ళి చేసుకుంటాడు. రవి బయటి నుంచే అక్షింతలు వేస్తాడు. కొడుకు మీద దిగులుతో రవి తల్లి మెట్ల మీద నుంచి జారిపడి మంచాన పడుతుంది. వేరే వూళ్ళో రవి వుండటం వలన చూడ్డానికి కుదరదు. రవి తల్లి దిగులుతో మరణిస్తుంది. భార్య మరణానంతరం భూషయ్యలో మార్పు వస్తుంది. రవికి కొడుకు పుట్టాడన్న వార్త తెలిసి దొంగచాటుగా చూసి.. ఆ బిడ్డ మెళ్ళో బంగారపు గొలుసు వేస్తాడు. సదానందం, రేలంగి, జోగులాంబ, సూర్యకాంతం పథకం వేసి... మామ చేత ఆస్తి రాయించకుందామనుకుంటాడు. ఇందుకు భూపతి దొంగ సహాయాన్ని కోరతాడు. 'కులగోత్రాలు కన్నా – మంచితనమే మిన్న' అని తెలుసుకున్న భూషయ్య... కొడుకు, కోడలూ మనవణ్ణి అక్కున చేర్చుకుంటాడు.

ఔట్ డోర్...

అక్కినేని అవుట్‌డోర్ షూటింగులంటే ఇష్టపడే వాడు కాడు. జనం తాకిడి ఎక్కువగా వుంటుందని. కానీ సుబ్బారావుగారి అభ్యర్థన మేరకు భీమిలి, విశాఖల్లో పాటల చిత్రీకరణకి పచ్చజెండా వూపారు. మొట్టమొదటగా భీమిలి అందాలు వెండితెర మీద ఆరబోసిన ఘనత 'కులగోత్రాలు' చిత్రానికి దక్కుతుంది. భీమిలి నరసింహస్వామి కొండమీద అక్కినేని, కృష్ణకుమారి, జి.వరలక్ష్మిలపై పెళ్ళి దృశ్యం చిత్రీకరణ జరిగింది. ఇది చూడ్డానికి జనం తండోపతండాలుగా వచ్చారు. 'చెలికాడు నిన్నేరమ్మని పలుకా..చేరరావేలా...', 'చిలిపికనుల తీయని చెలికాడా' ఈ రెండు పాటలూ భీమలి, విశాఖ బీచ్‌రోడ్‌లో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సముద్రపు అలల బ్యాక్‌డ్రాప్‌లో చిత్రీకరించారు. ఆ రోజుల్లో అక్కినేని కృష్ణకుమారిల మధ్య అందమైన కెమిస్ట్రీ కుదిరింది. మంచి పేరొచ్చింది. ఆనాటి నుంచి ఈనాటి వరకూ తెలుగు, హిందీ చిత్రాల చిత్రీకరణకి వేదికగా నిలిచాయి భీమిలి – విశాఖలు.

నటీనటులు

ఈ సినిమాలో అక్కినేని చాలా అందంగా కనిపిస్తాడు. హుషారుగా కనిపిస్తాడు. అలాగే కృష్ణకుమారి కూడా. ఈ సినిమాలో రాజబాబు, హీరో కృష్ణలు చిన్నపాత్రల్లో కనిపించడం విశేషం! తదుపరి కథలు ప్యార్లల్‌గా హాస్యాన్ని నడిపించడం దర్శకుడి చాతుర్యం. రేలంగి, రమణారెడ్డి, పద్మనాభం సూర్యకాంతం వీరంతా కుటుంబసభ్యులుగా, దురాశాపరులుగా ఆ పాత్రల్లో జీవించారు. 'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనె' పాట ఈ రోజు విన్నా జనం ఘొల్లుమని నవ్వుతారు. ఏ సందర్భంలో ఎవరు డబ్బులు పోగొట్టుకున్నా ఈ పాటే గుర్తుకొచ్చేంత ప్రాచుర్యం పొందింది.

అవార్డులూ - రివార్డులూ

ఈ చిత్రం కథ కులగోత్రాల నేపథ్యంలో కొనసాగినప్పటికి కుటుంబ నేపథ్యం డామినేట్ చేసింది. ఒక అందమైన కుటుంబ కథా చిత్రంగా రూపుదిద్దుకుంది. అదీ దర్శకుడి ప్రతిభ. ఈ సినిమా పండిత పామరుల్ని అలరించింది. ముఖ్యంగా ఆ రోజుల్లో యువతని ఎక్కువగా ఆకర్షించింది ఈ చిత్రం. ఉత్తమ కథాచిత్రంగా అవార్డులూ గెలుచుకుంది. అలాగే సంగీత భరితచిత్రంగా పేరు తెచ్చుకుంది. ఈ సినిమా ప్రభావంతో కులగోత్రాల పట్టింపులు మరచిపోయి మనుషులూ మనసులూ ముఖ్యమని వారి పిల్లల ప్రేమల్ని అంగీకరించిన తల్లిదండ్రులూ వున్నారు. అదీ ఈ చిత్రం అసలైన విజయం!

- ఇమంది రామారావు
9010133844

నేనో హరివిల్లునయ్యా...

సన్నగా చినుకు పడుతున్నపుడు
నన్నొంచి మెడ చుట్టూ చేతులు వేసి
ఎత్తుకో మని గారాలు పోయియనపుడు
పాపా! నేనో హరివిల్లునయ్యా.
కాడమల్లె చెట్టుకింద రాలిన
పూలన్నిటిని నా చే ఏరించి
నీ ఒడి నింపుకున్నపుడు
పాపా! నేనో తేటినయ్యా.
వెన్నెల రాత్రి డాబాపై కథలు వింటూ
నా గుండెలపై కుందేలు పిల్లలా
ముడుచుకు పడుకున్నపుడు
పాపా! నేనో చందమామనయ్యా.
వచ్చీరాని మాటల నుంచి
పాటలు నేర్చి ఆటలు ఆడి
పరమళిస్తూ ఎగిరినపుడు
పాపా! నేనో వసంతమయ్యా.
కర్ర చేతికిచ్చి పార్కులో
నాలుగడుగులు వేయమని
నా చేయిపట్టి నడిపించినపుడు
ఓ కూతురా! నే నీకు కొడుకైతి
ఈ జన్మలోనే.

- నారాయణ మూర్తి తాతా
92980 04001



కవిత్వం

అప్పు-వడ్డీ

ఆలోచనల మెట్ల వరుసమీంచి
పడుతూలేస్తూ అసలు మేయని ధైర్యాన్ని
నా తల్లిదండ్రులు నెమరువేస్తున్నారా!...
అప్పుడు నా ఉనికితోపాటే
అదీ ఉసురు పోసుకుంది
అది లేకుండా నా బొడ్డుతాడు తెగకపోయేను
నాకంటే ముందే పురిటినీళ్ళు పైనపోసుకుని
బుడిబుడి నడకలతో వడివడిగా పరుగులెత్తింది
నా పెదాలు అమ్మ చనుమొనలను తాకకముందే
ఆమె ఎదను ఆవిరి చేసింది నేను పలక పట్టేందుకూ
నాన్న అరక దున్నేందుకూ ఆసరాగా ఉన్న బిడ్డ
ఇప్పుడు ఓ ఆక్టోపస్ మా మెతుకులన్నీ మింగుతున్న
క్యాన్సర్ పుండు బతుకుల చీకటిలో
ఇంద్రధనస్సులా కనిపించి ఇప్పుడు
మా శ్వాసలను శాసిస్తుంది ఆశల వాకిటిలో
ఆనందాల హరివిల్లులా మొలిచి ఇప్పుడు
మా ఊపిరులకు సంకెళ్ళు వేస్తుంది
మా కన్నీటి అలల మీద ఉయ్యాలలూగుతూ
మమ్మల్ని ఆశల నిద్రలోంచి లేపి
అవమానాల కొలిమిలోకి విసిరి కొడుతోంది
వామనుడు విశ్వమంతా నిండినట్లు
మా జీవితాల్ని కమ్మేసింది సాలెపురుగు
తన దారాన్ని తాకిన జీవిలో రక్తాన్ని పీల్చినట్లు
మమ్మల్ని ఒరుగుల్ని చేసింది అనంతమైన ఆకలి కదా
పుట్టడానికి ఇప్పుడు మరో ఇంటిని చూసుకుంది

-తాండ్ర రమణ
9492319365

సింగిల్ పేరెంట్

కథ

గంగాధర్ వీర్ల

9502328972

రాత్రి ఎదురైన.. అనుభవాలు ఇంకా ఆమెను తరుముతూనే ఉన్నాయి. రాత్రంతా నిద్ర లేకుండా గడపడం వల్లనో.. ఏమో! ఆమె.. కళ్ళు చింతనిప్పుల్లా మారాయి. సూర్యుడు చీకటిని చీల్చుకుంటూ కిటికీలోకి తొంగిచూస్తున్నా గానీ.. ఎందుకో ఆ వెలుతురును చూడలేనంత అసహనం కలుగుతుందామెకు. బలవంతంగా లేవాలని ఉన్నాగానీ, కదలనివ్వని దేహం ఏదో ప్రశ్నిస్తున్నట్టుగానే ఉంది. కాసేపు.. మోకాళ్ళపై తలపెట్టుకుని.. మంచంపై అలా ఉండిపోవాలనే ఉందామెకు. అలాంటి స్థితిలోంచి ఆమె ఎలాగోలా నాలుగు అడుగులు వేసింది.

షవర్ పైనుంచి తలపై చల్లగా నీళ్ళు జారిపడుతున్నాగానీ.. శరీరమంతా కంపరంగానే ఉంది. గడిచిన అర్ధగంటలో.. అప్రయత్నంగానే రెండుసార్లు స్నానం చేసొచ్చిందామె. అయినా.. ఇంకా ఏదో శరీరాన్ని పట్టుకుని వదల్లేదనే భావన మనసుని ఒక పట్టాన స్థిమితంగా ఉండనివ్వడంలేదు. రాత్రి జరిగింది.. ఒక్కొక్కటీ క్రీనీడలా కళ్ళ ముందుకొస్తుంటే.. శరీరమంతా చెమటతో తడుస్తోంది. అది భయమో.. చిరాకో.. ఉక్రోషమో.. అసహ్యమో?!.. మరింకేదైనానేమో?!. గది నిండా వణకు పుట్టించేంత ఏసి గాలి ఒంటిని తాకుతున్నాగానీ.. చెమట గుబులు తీవ్రత అంతకంతకు ఎక్కువవుతూనే ఉంది. మరోసారి గభాల్న నాలుగు చెంబుల నీళ్ళు గుమ్మరించుకుంటేగానీ.. ఆమె మనసు, శరీరం కాస్తంత ఆధీనంలోకి రాలేదు. సరిగ్గా ఆరు నెలల క్రితం.. ఓ అర్ధరాత్రి పూట.. ఇద్దరి మధ్య సాగిన సంభాషణలు ఒక్కొక్కటిగా గుర్తుకొస్తున్నాయి.

ooo

భార్యభర్తలుగా.. దాదాపుగా పద్దెనిమిదేళ్ళ అనుబంధం. ఆ అనుబంధానికి గుర్తుగా.. ఇద్దరు ఆడపిల్లలు. టెన్త్, ఇంటర్ చదువుతున్నారు. అతడిది హెూదాగల ఉద్యోగమే. ఆమె ఇన్నాళ్ళూ గృహిణిగానే ఉండిపోయింది. పెళ్ళయి దాదాపు పదిహేనేళ్ళ తర్వాత.. పిల్లలు ఎదిగాక.. రెండు మూడేళ్ళుగా అతడి ప్రమేయంతో చిన్న ఉద్యోగంలో చేరిందామె. భార్య సంపాదిస్తూ.. కుటుంబానికి సాయంగా ఉండటం అతడికి బాగానే ఉంది. కానీ ఉద్యోగం పేరుతో.. రెక్కలొచ్చిన పక్షిలా.. భార్య

కాస్తంత స్వతంత్ర్యంగా ఉండటమే.. అతడి మనసు జీర్ణించుకోలేకపోతుంది. అప్రయత్నంగానే అతడి.. మనసులో అనుమానపు బీజం మొలకెత్తడం మొదలైంది. అది రోజురోజుకీ చాపకింద నీరులా పాకుతోంది. భార్య విషయంలో అతడిప్పుడు మునపటిలా లేడు. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూస్తున్నాడు. నివురుగప్పిన నిప్పులా ఆలోచిస్తున్నాడు.

○○○

ఆరోజు రాత్రి. ఒకే మంచంపై అతడు, ఆమె. ఎప్పటిలానే రెండు శరీరాలూ తన్మయత్వంతో కాసేపు పెనుగులాడాయి. పెళ్ళాంపై ఉన్న ఇష్టమో, వ్యామోహమో, కోరికోగానీ.. ఆమె ప్రమేయం లేకుండానే.. అతడి శరీరం, ఆమెను బలంగా చుట్టేసుకుంది. భర్త కోరికను మన్నించడం తప్ప.. వద్దు.. అని ఆపలేని స్థితి ఆమెది. అప్రయత్నంగానే అతడి దేహానికి సహకరించింది. కొన్ని నిముషాల్లో అతడి కోరిక తీరింది. అటు తిరిగి.. అమె తన ఒంటిపై చెదిరిన బట్టలు సర్దుకుంటుంది. సరిగ్గా అప్పుడే అతడి నుంచి ఓ ఉక్రోషపు మాట.

"ఏంటీ.. ఈ మధ్య ఫోన్లలో కొత్తగా ఏవో బాగోతాలు నడుస్తున్న ట్టున్నాయి?" బుసలుకొడుతున్న స్వరంతో అడిగాడతడు.

బాగోషం అనే మాట.. వినడానికే కొత్తగా ఉందామెకు. ఎప్పుడూ అంత కిందకు దిగజారి.. భార్యతో అతడు అలా మాట్లాడలేదు. పైగా విద్యాధికుడు. మంచి ఉద్యోగం ఉంది. సంఘంలో అంతో ఇంతో పలుకుబడి ఉన్నవాడు.

"బాగోతమా.." నిర్ఘాంతపోయిన స్వరంతో అడిగింది.

"అవును.. బరి తెగించిన బాగోతమే.." గొంతుపెంచి మరీ అన్నాడతడు.

"సరే.. ఆ బరి తెగించిన ఆ బాగోతమేంటో చెప్పు?' ఒక పక్క ఆ మాట తన మనసును మెలిపెడుతున్నా.. మనసులోనే అణచుకుని అడిగిందామె.

"నీ ఫోన్లో అన్నీ చూశాలే.. ఫేస్‌బుక్లో కూడా ఈ మధ్య బాగానే తరిస్తున్నట్టున్నావ్? ఎవడాడు.. ప్రేమలు, కోరికలు, విరహాల దాకా వచ్చిందా మీ రిలేషన్? అందుకేనా.. ఈ మధ్య ...దానిలా సింగారించుకుని.. ఆఫీసుకి బయలుదేరుతున్నావ్?" ఎప్పటి నుంచో భార్యను అడగాలనుకున్న విషయాన్ని అడిగేశాడు అతడు.

"తాళికట్టిన భార్యను ఇలా అడగడానికి మనసెలా వచ్చింది.." ఆమె ఇంకా ఏదో అడగాలని ఉన్నా.. బాధతో మాటలు కరవవయ్యాయి.

"బాగోతం కాక.. మరింకేంటి.. ఉద్యోగానికి వెళుతోంది అందుకేనా? అక్కడ తమరు వెలగబెడుతున్న రాస కార్యాలేంటో.. నాకు తెలియదనుకుంటున్నావా?" వ్యంగ్యాన్ని, అనుమానాన్ని పీకల దాకా నింపుకుని.. మళ్లీ అదే మాట రెట్టించాడు అతడు.

"మరి.. ఆ రాసకార్యాలన్నీ చూస్తున్నప్పుడు.. ఎందుకు, రోజూ.. ఎంతో ప్రేమ ఒలకబోస్తూ.. పక్కలోకొస్తున్నావ్?" కోపం అణచుకోలేక అడిగిందామె.

అవతలివాళ్ళు మాట్లాడే భాషను బట్టే.. మన భాష, ప్రవర్తన ఆధారపడి ఉంటాయి. ఇప్పుడు ఇద్దరి మధ్యా.. అదే జరుగుతోంది. ఆమె కూడా పీజీ దాకా చదువుకుంది. హుందాగా మాట్లాడ్డం ఎంత తెలుసో.. అంతకంటే నాలుగు మెట్లు కిందకు

దిగి మాట్లాడ్డం కూడా ఆమెకు అంతే బాగా తెలుసు.

"బయట.......... ఇంట్లోవాడేం నచ్చుతాడులే.." అనాల్సిన మాట అనేశాడు.

"అంటే.. ఇన్నాళ్ళూ.. కడుపులో ఇంత కల్మషం, కుల్లూ పెట్టుకునే ఏమీ ఎరగనట్టు ...." కళ్లల్లో నీళ్ళు తిరుగుతున్నా.. తుడుచుకోవాలనిపించట్లేదు ఆమెకు.

"బాగోతం గురించి అడుగుతున్నానని కోపం పొడుచుకొచ్చిందా?" తాను వేసిన నిందారోపణకు.. మరిన్ని మాటలతో బలాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడతడు.

"దిగజారిపోయి మాట్లాడకు.. సోషల్‌గా మూవ్ కావడం నీకు బాగోతంలా ఉందా.. అలాంటప్పుడు.. పనిగట్టుకుని, ఎంతో ఆదర్శంగా ఉద్యోగం చెయ్యమని నన్నెందుకు బలవంతంగా బయటకు తోశావ్.. ఇంట్లోనే పడి చచ్చేదాన్నిగా.. " గుండెల్లోకి సూటిగా దూసుకొచ్చిన అతడి మాటలకు ధీటుగానే అంది ఆమె.

"నిన్ను బయటకు పొమ్మంది... అడ్డమైనోళ్ళతో తిరిగిరమ్మని.. కాదు.." అతడి మాటల ప్రవాహానికి హద్దు, అదుపు లేనట్టుగా ఉంది.

"మొత్తానికి.. తాళి కట్టించుకున్న పాపానికి నన్ను తిరుగుబోతుని చేశేసావన్నమాట.. అసలు నేనెవడితో తిరిగానో.. నువ్వు చూశావా? ఫోన్లో కొలీగ్స్‌తో మాట్లాడ్డం.. ఫోన్లో ఛాట్ చేస్తున్నంత మాత్రానా.. పెళ్ళాం అని కూడా చూడకుండా.. అంతంత మాటలు అనేస్తావా? అసలు ఏం మాట్లాడుతున్నావో అర్థమవుతుందా నీకు?" ఆమె గొంతు ఆవేదనతో జీరబోతోంది.

"నంగనాచిలా మాట్లాడకు.. నీకు మొగుడొక్కడు చాలడు...." ఇంకా ఏదో పెద్దమాట అనాలనే ఉక్రోషం అతడిలో బుసలు కొడుతోంది.

"చాలదు.. చాలదు.. చాలదు.. చాలదు.." ఆమె మనసు బద్ధలైనట్టుగా గట్టిగా అరిచింది. ఇద్దరి మధ్య కాసేపు నిశ్శబ్దం.

"అయితే.. ఈరోజు నుంచి నువ్వూ నాకు అక్కరలేదు.. అదేదో.. వాళ్ళతోనే ఉండు... నాకు తెలుసు.. నువ్వు పచ్చి.." అనకూడని మాటను పంటిపైనే బిగబెట్టుకుంటూ విసురుగా పక్క గదిలోకి వెళ్లిపోయాడతడు.

ooo

అలా.. ఆరు నెలలగా.. భార్య శీలాన్ని శంకించి, అనుమానించి, మాటలతో అవమానపరచి.. పంతం పట్టి మరీ ఆమెకు దూరంగా ఉంటున్నాడతడు. అలా దూరంగా ఉంటూ "చెడిపోయిన పెళ్ళాం.. నాకు అవసరంలేదు.." అని ఆమెకు చెప్పాలనే కుటిల ప్రయత్నం అతడిది.

ఆ రోజు నుంచీ ఇద్దరి గదులూ వేరయ్యాయి. తనపై మోపిన నిందను, జరిగిన అవమానాన్ని,

ఇదే ఆమెకు మింగుడు పడటంలేదు. ఇద్దరి మధ్య మానసిక బంధం ఎప్పుడో ముక్కలైపోయింది. పేరుకే భార్యభర్తలు. మనసులూ శరీరాలూ వేరుగానే సాగిపోతున్నాయి. కానీ, అతడి శరీరకాంక్ష తీర్చుకోవడం కోసం రాత్రి తన ప్రమేయం లేకుండా పశువులా ప్రవర్తించడమే ఆమె జీర్ణించుకోలేక పోతోంది. అద్దంలా బద్ధలైన మనసులో అతడిప్పుడు లేడు. లేనప్పుడు అతడి కోరికను తీర్చే సహదయం ఆమెకు లేదు.

గుండెల్లో గుచ్చుకున్న మాటల్ని క్షణక్షణం తలచుకుంటూ.. ఆమె కూడా మానసికంగా ఒంటరిగానే కాలం గడుపుతోంది.

ooo

ఆరునెలల తర్వాత.. నిన్న రాత్రి అతడు పశువులా మారిన వైనాన్ని మర్చిపోలేకపోతోంది.

అతడు చెప్పాపెట్టకుండా భార్యగదిలోకి చొరబడ్డాడు. గాఢనిద్రలో ఉన్న ఆమెను ఆక్రమించుకునే ప్రయత్నం అతడిది. కొన్నాళ్ళుగా వయసు, మనసు చంపుకుని.. నిద్రాణావస్థలో గత కాలం గడిపేయడం అలవాటు చేసుకున్న ఆమె.. తన శరీరంపై జరిగే గగుర్పాటు అలికిడికి కళ్ళు తెరిచి చూసింది. అతడి మొఖం.. కామోద్రేకంతో రగులుతోంది. వేడెక్కిన శరీరం.. సెగలై.. ఆమెపై విచ్చలవిడిగా పాకుతోంది. గట్టిగా విదిలించుకోబోయింది. అసహ్యంతో దూరంగా నెట్టబోయింది. కానీ, అతడి బలం ముందు ఆమె బలం సరిపోలేదు.

ఇదే ఆమెకు మింగుడు పడటంలేదు. ఇద్దరి మధ్య మానసిక బంధం ఎప్పుడో ముక్కలైపోయింది. పేరుకే భార్యభర్తలు. మనసులూ శరీరాలూ వేరుగానే సాగిపోతున్నాయి. కానీ, అతడి శరీరకాంక్ష తీర్చుకోవడం కోసం రాత్రి తన ప్రమేయం లేకుండా పశువులా ప్రవర్తించడమే ఆమె జీర్ణించుకోలేక పోతోంది. అద్దంలా బద్ధలైన మనసులో అతడిప్పుడు లేడు. లేనప్పుడు అతడి కోరికను తీర్చే సహదయం ఆమెకు లేదు. కోరిక వల్లనో.. అవసరం వల్లనో.. భర్త అనే బంధనాల వల్లనో ఒకప్పుడు ఆమె దేహం అతడితో రమించిందేమో?! ఫలితంగా ఇద్దరి బిడ్డలకు తల్లయ్యింది.

ఒకప్పుడు అతడి స్పర్శకు పులకించి, పరవశించిన దేహం.. ఇప్పుడు మాత్రం.. జీవచ్ఛవంగా మారిపోయింది. నాడు.. పెళపెళమంటూ చప్పుడు చేసిన తనువును, కేవలం భర్త అనే హక్కుతో చెల్లని కరెన్సీ నోటులా మార్చేసిన అతడి దేహపు నీడంటేనే ఆమెలో మాటలకందని విరక్తి ఏర్పడింది.

"వద్దు.. వద్దు.. ఇక చాలు. మగువ అంటే తనువు మాత్రమేనా..." కొంతకాలంగా జవాబు దొరకని ప్రశ్నలకు.. ఆమెకు ఓ పరిష్కారం దొరికింది. ఇప్పుడామె.. తనువెల్లా ముక్కలైన తన హృదయాన్ని తిరిగి అతికించాలని అనుకోవడం లేదు. కానీ, ఒంటరిగా.. ఎక్కడికో దూరంగా వెళ్ళి తనను తాను తనివితీరా చూసుకోవాలని భావిస్తోంది. కనీసం కొన్నాళ్ళపాటైనా ఆత్మవిశ్వాసంతో అతడు లేని లోకంలో బతకాలి. పిల్లలకూ అన్నీ తానై అండగా నిలవాలి.. ఇలా ఆమె ఆలోచనలు ఒక్కొక్కటిగా బలం పుంజుకుంటున్నాయి. బహుశా.. ఇక మీదట ఆమె.. సింగిల్ పేరెంట్ కావొచ్చు. ■

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థి తుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరు నామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరు నామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:
snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

గాయపడ్డ కవి ఘోష

ఇక్ష్వాకుల యుగం అంతరించింది. ఇంటర్‌నెట్ యుగం ఆగమించింది. ఐనా అగ్రహారాల మధ్య వెలి వాడల మధ్య అంతరాలు తొలగిపోలేదు. ధనికులు పేదల మధ్య భేదాలు సమసిపోలేదు. ప్రజలను కన్న బిడ్డల్లా కాపాడవలసిన ప్రభుత్వాలే సెజ్‌ల పేరిట పేదల భూములకు ఎసరు పెట్టింది. పడగ విప్పిన పారిశ్రామికీరణతో, ప్రపంచీకరణతో పల్లెలు పల్లె లక్షణాలు కోల్పోయాయి. అకాల వర్షాలతో, అప్పులతో అన్న దాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. విద్య, వైద్యం వ్యాపారమై పోయాయి. మహిళ మార్కెట్ వస్తువుగా మారిపోయింది. ఇవన్నీ శ్రీ నాగాస్త్ర రచించిన "గాయపడ్డ గుండె భాష" కవితా సంపుటిలోని కవితా వస్తువులు.

మనది ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకొంటాము కాని ఎన్నికలు ఎంత సక్రమంగా జరుగుతాయనేది బహిరంగ రహస్యమే. "చే రాగం" కవితలో ఎన్నికల్లో జరిగే అన్యాయాన్ని ఎండగడతారు. చిటికెన వేలును మఠాధిపతి దొంగిలించుకుపోయాడు అంటూ మఠాధిపతుల గుట్టును బట్ట బయలు చేస్తారు. వీటన్నిటినీ సామాన్యుడు ఎదిరిస్తాడని చెప్తూ "బిగించిన పిడికిలి శ్రమ జీవులెత్తిన ఐక్యతా సంకేతం" అని మామూలు ప్రజలు మౌనంగా వుండరని ఏకమై అన్నిటినీ ఎదురిస్తారని కవి చెప్తున్నాడు. అన్నం పెట్టే రైతులే అనేక సమస్యలతో ఉరి తాడుకు వేలాడుతున్నారు. దీన్నే "నివురు గప్పిన నిప్పురవ్వలు"లో 'పంట భూమి నీలి సాగుతో రూపాయి బిళ్ళైపోయింది. (రైతుబిడ్డ) చేలోనే దిష్టి బొమ్మై పోయాడు' అని రైతు విషాద



పుస్తకం పేరు: గాయపడ్డ గుండె భాష
రచయిత: శ్రీనాగాస్త్ర
పేజీలు:132
వెల:100/-
ప్రతులకు: శ్రీనాగాస్త్ర, కృష్ణాపురం గ్రామం, టి.నర్సాపురం(పో), పశ్చిమ గోదావరి 534467.
సెల్: 9640317108

జీవన చిత్రాన్ని అక్షర రూపంలో ఆవిష్కరిస్తారు కవి.

కుల వ్యవస్థలో మార్పు రాలేదనే విషయాన్ని "ఈ ముద్ద దిగట్లేదు" కవితలో తరాలు మారినా, కాలాలు మారినా అంధయుగం నుండి అంతరిక్ష యుగందాకా ఎదిగినా (వెంటాడి వేటాడుతున్న మనువు వర్ణ వ్యూహాలు) చెదరని కూలని నిచ్చెనమెట్ల కుటిల భావాలు) "అని చెప్తారు కవి. ఈ సమాజంలో కులం పోలేదని అంటూ మళ్ళీ (మళ్లీ మళ్లీ అదే ప్రశ్న) నీది ఏ కులం రా?" అని ప్రశ్నిస్తుంది అంటారు. ఈ ఆధునిక యుగంలోను మనుధర్మం మారలేదు.

అభివృద్ధి పేరిట కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికీకరణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నాయి. దీని వలన కలిగే ప్రభావాలనుపదునైన వాక్యాలతో విమర్శించారు. గోల్డు బిస్కెట్లా రగించే పెత్తందారులు పెంపుడు పాలక జంబూకాలు అని అంటారు. "మా అమ్మ" కవితలో "వాకిట్లో చీకట్లు ఊడ్చేసి ఉషోదయ జ్యోతిర్లతల కల్లాపి చల్లుతుంది." అని అంటూ 'చందమామ శయనించాలన్నా మా అమ్మే సుప్రభాతం పాడాలి' అని అమ్మ గొప్పతనాన్ని ఆవిష్కరిస్తారు.

"చాకిరేవు న్యాయంలో తన కవిత్వం ఎవరి కోసమో స్పష్టంగా చెప్పారు. "నా అక్షరాలు చాకిరేవు బండలు కవిత్వం కొలిమిని మండించి అక్షరాల అగ్గిరవ్వల్ని రాజేసి ఇంక్విలాబ్ జిందాబాద్ సానపట్టుడే సానపట్టడం" అని సామాన్య ప్రజల పట్టే తన కలం స్పందిస్తుందని అంటారు.

"గాయపడ్డ గుండెభాషలో పేదవాణ్ణి అణచివేస్తే ఊరుకోడని తిరుగుబాటు జెండాలా రెపరెపా ఎగురుతాడు, తిరుగుబాటు చేస్తాడు' అని అంటారు కవి. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను పేదవారిపై ధనికులు చేస్తున్న దోపిడీని, రాజకీయ నాయకుల స్వార్థానికి వ్యతిరేకంగా పేల్చిన తూటాలు "గాయపడ్డ గుండె భాష" లోని కవితలు.

-మందరపు హైమావతి

వెలుగుల సంగీతం

ఏదైనా శ్రావ్యమైన సంగీతాన్ని సృజించాలంటే ప్రాక్టీస్ తప్పనిసరి. స్వరాలని సరిగ్గా పలికించాలంటే కీబోర్డ్ కీస్ అమరిక, గిటారైతే ఏ తీగను ఎలా మీటాలనే విషయాలపై పట్టుసాధించాలి. పరికరం తీరెలా ఉందో తెలిస్తేనే సౌలభ్యంగా ఉంటుంది. మరి కంటి చూపులేని వాళ్ళు సంగీత కచేరీలిస్తే అదో అద్భుతం.. వెలుగుల సంగీతం. ఇలా ఇస్తున్నారా అనే నమ్మకం కుదరకపోతే 'అల్ నౌర్ వాల్ అమల్' బృందం గురించి చదివేయండి మరి. 'అల్ నౌర్ వాల్' 1954లో మధ్య ప్రాచ్యంలో చూపు కోల్పోయిన బాలికలు, మహిళల కోసం స్థాపించిన మొట్టమొదటి సేవా బృందం. వీరి ప్రత్యేకత ఏమిటంటే... ఇక్కడ వీరి సంరక్షణతోపాటు వివిధ సంగీత పరికరాలపై శిక్షణనిస్తారు. వయోలిన్, సెల్లో, పిల్లనగ్రోవి ఇలా ఏ సంగీత పరికరమైనా ఇక్కడి వారందరూ తేలిగ్గా వాయిస్తుంటారు. వీళ్ళిప్పుడు కచేరీలు కూడా నిర్వహిస్తున్నారు. దీని కోసం పూర్తి స్థాయిలో తర్ఫీదుపొంది పక్కా ప్రొఫెషనల్స్‌లా ప్రదర్శనలతో మతి పోగొడతారు. వీళ్ళు శిక్షణ తీసుకునేది బ్రెయిలీ లిపి ద్వారానే. ఇక్కడ సభ్యులుగా చేరే వారికి ముందుగా స్ట్రింగ్స్, వుడ్ విండ్స్, బ్రాస్, పెర్క్యూషన్‌లో శిక్షణ ఇస్తారు. రోజుకు ఐదు గంటల పాటు సాధన చేస్తారు. ఎంతో పేరు పొందిన కైరో సింఫొనీ ఆర్కెస్ట్రా మ్యూజిక్ అకాడెమీలో కొన్నేళ్ళు శిక్షణ పొందుతారు. పట్టుసాధించిన వారితోనే కచేరీలు ఇస్తుంటారు. వాటిలో పాల్గొనడం అంటే అంత తేలికేంకాదు. 'ఆల్ నౌర్ వాల్' ప్రత్యేకత ఇక్కడే తెలుస్తుంది. ఎలాంటి మ్యూజిక్ స్కోర్ లేకపోయినా తాళం, ఆలాపనల మీద సరైన అవగాహన కల్పించి రాగాలని పట్టుకునేలా శిక్షణ చేస్తుందీ సంస్థ. తొలినాళ్ళలో పదిహేను మందితో మొదలైన ఈ శిక్షణ సంస్థలో ఇప్పుడు 48 మందితో ఒక గట్టి మహిళా సంగీతకారుల బృందమే ఏర్పడింది. ప్రపంచంలో అంధుల మహిళల కోసం ఏర్పడిన తొలి క్లాసికల్ మ్యూజిక్ ఆర్కెస్ట్రాగా పేరున్న ఈ సంస్థ సభ్యులు ఇప్పుడు ప్రపంచవ్యాప్త ప్రదర్శనలతో అందర్నీ ముగ్ధుల్ని చేస్తోంది. ★

కాశ్మీరీ కట్టడం

ప్రత్యేకం

జున్ డబ్, కాటమ్‌బన్ద్ పురాతన కాశ్మీరీ కట్టడాలకి, ఒకప్పటి సంస్కృతీ సాంప్రదాయాలకి నిలువెత్తు నిదర్శనాలు. పెద్ద పెద్ద భూకంపాలని సైతం తట్టుకొని నిలబడగలిగిన ఆ కట్టడాలన్నీ ఇప్పటికీ అక్కడ కనిపిస్తాయి. ఈ నిర్మాణ శైలులన్నీ విదేశీయులనీ ఆకట్టుకున్నాయి. ఒకప్పటి ఆ నిర్మాణాలన్నీ ఇప్పుడు మళ్లీ కాశ్మీర్‌లో అంతలా ఫేమస్ అయిపోవడానికి కారణమేంటో మీరే చదివి తెలుసుకోండి.



కాశ్మీర్‌లోని పురాతన కట్టడాల్లో జున్, కాటమ్‌బన్ద్ స్థానిక కళారూపాలకి సాక్ష్యాలైతే మరి కొన్ని నిర్మాణ రీతులు ఇక్కడ వలస రాజ్యాల ద్వారా ప్రవేశించాయి. పురాతన కాశ్మీరీ నిర్మాణ శైలికి నిలువెత్తు నిదర్శనంగా వుండే ఆ నిర్మాణాలన్నీ అద్భుతాలే. ఒకే ఒక్క పిల్లర్ ఆధారంగా నిర్మించే ఇంటి బాల్కనీ నుండి చంద్రుడిని చూసేందుకు వీలుగా నిర్మించిన ఆ అందమైన కట్టడాన్ని అక్కడ జున్ అని పిలుస్తారు. ఎలాంటి ఆధారం లేకుండా చతురస్రాకారంలో రూపు దిద్దుకున్న ఈ కట్టడాలన్నీ ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఇక నదీతీరాల వెంబడి నిర్మించే కట్టడాల ప్రత్యేకతే వేరు. ఇంటి నుండి స్థానిక నదిని వీక్షించేందుకు వీలుగా లంబకోణంలో నిర్మించే ఆ కళాత్మక నిర్మాణాలన్నీ ఒకప్పటి సాంకేతికతకి అద్దంపడతాయి. ఇలాంటివన్నీ శ్రీనగర్‌లో మనకి కనిపించే నిర్మాణాలు. ప్రయాణానికి అనువుగా ఇళ్ళ నుండి బైటికి మెట్లని ఏర్పాటు చేసుకున్న తీరు మరో ప్రత్యేకత.

మూడు-నాలుగు అంతస్తులుగా వుండే ఈ భవనాల్లో మెట్లని ఇంటి ముందు వుండే నది నుండి నేరుగా ఇంటిలోని బాల్కనీ వద్దకు చేరుకునేలా ఏర్పాటు చేసుకోవడం ఒకప్పటి శ్రీనగర్ భవన నిర్మాణాల్లో కొత్తదనాన్ని చాటుతాయి. ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఎక్కువగా పడవ ప్రయాణాలు వుండడంతో ఈ రకమైన నిర్మాణాలనే ఎక్కువ మంది ఇష్టపడేవారు. ఇంటర్ లాకింగ్ విదానం ద్వారా ఇంటి పైకప్పులో అమర్చే ఫాల్స్ సీలింగ్ విధానాన్ని కాతంబంద్ అని పిలుస్తారు. కాగితాన్ని మందపాటి ఫలకాలుగా తయారుచేసి వాటిపై చిన్నపాటి పెయింటింగ్స్‌తో తీర్చిదిద్దే వీటిని పెపైర్ ప్యానెల్స్ అని పిలుస్తారు. ఫాల్స్ సీలింగ్‌కి వీటిని ఎక్కువగా వినియోగించేవారు. 15వ శతాబ్దంలో ఇరాన్ నుండి ఇవి శ్రీనగర్ ప్రాంతానికి ప్రవేశించినట్టు కొన్ని చారిత్రక ఆధారాలున్నాయి. వలయాకారంలో పునరావృతం అయ్యే ఈ ఆకృతులని కలిగుండే కొన్ని ఫలకాలు ఒక చోట చేర్చి ఏర్పాటు చేసే ఈ ఫాల్స్ సీలింగ్ వెచ్చదనాన్ని అందిస్తాయి. ఇలాంటి సీలింగ్‌లు ఇప్పటికీ మనకి శ్రీనగర్‌లోని కొన్ని పురాతన కట్టడాల్లో కనిపిస్తాయి. శ్రీనగర్ ఇప్పటికే భూకంపాల తీవ్రతలో హైరిస్క్ సెసిమిక్ జోన్-5ని చేరుకుందనేది భూగర్భ శాస్త్రవేత్తల అంచనా. అయితే (ఇప్పటి కాంక్రీట్ కట్టడాల కంటే) ఇలాంటి పురాతన కట్టడాలన్నీ ఎన్నో భూకంపాలని తట్టుకొని నిలబడగలిగాయి. మరో రెండు పురాతన నిర్మాణశైలుల్లో తాక్, దజ్జి దివారీ ముఖ్యమైనవి.



చెక్కతో చేసే పెద్ద పెద్ద కిటికీలు ఇంటిగోడల మధ్య ప్యాచ్ వర్క్‌ని మట్టితో చేసే విధానం ఇది. ఈ కట్టడాలకి ప్రత్యేకమైన రాళ్ళని ఉపయోగిస్తారు. ఇంటిగోడలు కిటికీల మధ్య ఖాళీలని నింపేందుకు ఉపయోగించే ఈ మట్టికి జిగురు శాతం ఎక్కువ. భూకంపాల ద్వారా వచ్చే నష్టాన్నే కాదు వాటి తీవ్రతని తగ్గించేదుకు ఇలాంటి వన్నీ అక్కడ ఎంతగానో ఉపయోడపడుతున్నాయి. ఆసియాలోని చాలా ప్రాంతాల్లో కనిపించే ఈ ధాజ్జి దీవారీ నిర్మాణాలు కొన్ని టర్కీలోను కనిపిస్తాయి. ఒకే చెట్టుకు సంబంధించిన కలపని ఉపయోగించి చేసే ప్రక్రియలో చెట్టుకొమ్మని చతురస్రాకారంలో వుండేలా తయారుచేస్తారు. ఇంటి పైకప్పులకి వాడే చెక్కకి ఒకవైపు తీగెల్లాంటి డిజైన్లతో తీర్చిదిద్దే ఈ కళారూపాలన్నీ దజ్జి దివారీ నిర్మాణ శైలిలో భాగంగా వుంటాయి.

అక్కడి మట్టితో తయారుచేసే ఇటుకలు కూడా ప్రత్యేకమే. పూర్తిగా చేత్తో చేసే చిన్న పరిమాణంలో వుండే ఇటుకలకి మహారాజ ఇటుకలని పేరు. కాశ్మీరీ రాజభవనాల నిర్మాణంలో వీటినే వినియోగించేవారు. వీటికి పూర్తి భిన్నంగా నిప్పు ద్వారా ఇటుకలో తేమ శాతాన్ని తగ్గించి తయారుచేసే వాటిని తాక్ నిర్మాణశైలి కట్టడాల్లో ఉపయోగిస్తారు. ఈ ఇటుకకి భూకంపాల తీవ్రతకి తట్టుకుని నిలిచే శక్తి ఎక్కువ. కాశ్మీర్‌లోని నౌహత్తా బసంత్ భాగ్‌లో ఇలాంటి నిర్మాణాలు దర్శనమిస్తాయి. జయినా, ఫతె, నవ కాదల్, గౌజ్ వారా ప్రాంతాల్లో కనిపించే ఈ పురాతన కాశ్మీరీ నిర్మాణ పద్ధతుల్నే ఇప్పుడు ఎక్కువ మంది ఇంటి నిర్మాణాల్లో ఉపయోగించేందుకు ఇష్టపడుతున్నారు. ★

పుస్తకాల బండి

కొందరు నవలలు, కథల పుస్తకాలని తెగ చదివేస్తుంటారు. మరికొందరు మ్యాగ్జైన్స్, జర్నల్స్‌ని ఇష్టపడతారు. ఇంకొందరికి అరుదుగా దొరికే పుస్తకాలని చదివేయడం హాబీ. ఇలా ఎవరి టేస్ట్‌కి తగ్గట్టు వాళ్ళకి పుస్తకాలని అందించడంలో కోల్‌కతకి చెందిన షా దిట్ట. పుస్తక ప్రియుల ఇంటి వద్దకే పుస్తకాలని చేరుస్తున్న షా ప్రాయాణం 32 ఏళ్ళుగా కొనసాగుతూనే వుంది. ఆన్‌లైన్ పుస్తక విక్రయాలు అందుబాటులో వున్నా ఇప్పటికీ ఎంతో మంది షా తెచ్చే పుస్తకాలని చదివేందుకు ఇష్టపడుతుంటారు. ఐదు పదుల వయసులోనూ తన బండిపై షా ఇలా పుస్తకాలని మోసుకెళ్ళడానికి కారణమేంటో మీరే తెలుసుకోండి.

కోల్‌కతాకి చెందిన షా రోజు మొదలయ్యేది పుస్తకాలతోనే.... ఒక స్కూటర్‌పై పుస్తకాలని పెట్టుకుని నగర వీధుల్లో తిరిగే షాని స్థానికులు కాస్త వింతగా చూసేవారు. ఎందుకంటే పుస్తకాలు కావాలంటే నగరాల్లో బుక్ స్టాల్, ఆన్‌లైన్ స్టోర్స్‌కి కొదవలేదు. ఫ్రీ డెలివరీ సదుపాయాలు కూడా లభిస్తాయి. మరి ఇరుకైన దారుల గుండా ప్రతి రోజూ షా ఇలా పుస్తకాలని ఎందుకు అందిస్తున్నాడనేది చాలాకాలం అక్కడి వారికి అంతుపట్టని ప్రశ్న. ఇళ్ల వద్దకే పుస్తకాలని అందించడమే షాకి నచ్చిన పని. ఇరుకైన కోల్‌కతా దారుల్లో స్కూటర్‌పై పుస్తకాలు తెచ్చే షా కోసం పెద్దలతోపాటు పిల్లలు కూడా ఎంతో ఆతృతగా ఎదురు చూస్తుంటారు. పుస్తకాలతో ఇంట్లో ఒక చిన్న పాటి లైబ్రరీనే ఏర్పాటు చేసుకున్నాడు షా. కస్టమర్స్ ముందుగా చేసిన ఆర్డర్స్‌తోపాటు వారి టేస్ట్‌ను బట్టీ మరికొన్ని పుస్తకాలని తన బుక్ షెల్ఫ్ నుంచి తీసి పక్కన పెట్టుకోవడంతో తన రోజు ప్రణాళిక మొదలవుతుంది. అరుదైన పుస్తకాల కోసం ఇతర పుస్తక విక్రేతలతో సంప్రదింపులూ జరుగుతుంటాయి. పుస్తకం ఎంత అరుదైనా షా వద్ద మాత్రం దొరికి తీరుతుంది. ఈ నమ్మకమే షా కోసం కోల్‌కతా వాసులు అంతలా ఎదురుచూసేలా చేస్తోంది. పిల్లలు పుస్తక పఠనంతోపాటు మంచి పుస్తకాలని అస్సలు మిస్సవ్వ కూడదనేది షా ఫిలాసఫీ. ఇంతకీ షాకి పుస్తకాలంటే ఎందుకంత ఇష్టమంటే.... సరిగ్గా ముప్పై నాలుగేళ్ల క్రితం షా తండ్రి గోపి లాల్ షా కోల్‌కత న్యూ మార్కెట్‌లో 'డే అండ్ బ్రదర్స్' బుక్ స్టోర్‌ని నిర్వహించేవాడు. అప్పుడు పుస్తకాలని డెలివరీ చేసే బాధ్యత తనదే....అలా పుస్తకాలు చదివే అలవాటూ ఏర్పడింది తనకి. జెఫ్రీఆర్చెర్ నవలలు, కథల పుస్తకాలు, యాత్రపై వచ్చే పుస్తకాలని ఇష్టపడతాడు. నిజానికి ఈ హాబీ తన కస్టమర్స్ అభిరుచిని తెలుసుకునేందుకు ఎంతగానో తోడ్పడిందంటాడు షా. ఇలా రోజంతా పుస్తకాలతోనే గడిపేస్తుంటాడు షా. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక కూడా ఇదే వృత్తిలో కొనసాగాలని నిర్ణయించుకున్నాడు. నమ్మకంగా పుస్తకాలని డెలివరీ చేయడంతోపాటు అరుదైన పుస్తకాలని వెతికి పట్టుకుని మరీ అందించడంతో ఆరితేరిన షాని స్థానిక క్లబ్ హౌసులు, మీడియా సంస్థలు అరుదైన పుస్తకాలకోసం సంప్రదించేవారు. తన అన్న సాయంతో తన వృత్తిని మరింత ముందుకు తీసుకెళ్ళాడు. అయితే ఇదంతా డబ్బుతీసుకునే చేస్తారనే సందేహం చాలామందికి కలిగినా షా డెలివరీకి ఎలాంటి డబ్బు వసూలు చేయడు. పుస్తకాల అసలు ధరకి మాత్రమే వాటిని విక్రయించడంతోపాటు ఇలా డెలివరీ చేయడం ద్వారా.. కనుమరుగవుతున్న పుస్తక పఠనాన్ని, పుస్తకాలని కొత్తతరాల వారికి అందించమే తన లక్ష్యం. ఒక క్లైంట్ ఏదైనా పుస్తకాన్ని ఆర్డర్ చేస్తే దానితో పాటు మరికొన్ని పుస్తకాలనీ తన వెంట తీసుకెళుతుంటాడు షా. మ్యాగ్జైన్లు, జర్నల్స్, సాహిత్యం, కథలపుస్తకాలు ప్రధానంగా వుంటాయి. వీటిలో ఏదో ఒక పుస్తకాన్ని ఇతర కుటుంబ సభ్యులు ఇష్టపడుతుంటారు. అలా ఏళ్ళ తరబడి కొత్త పుస్తకాలని పాఠకులకి పరిచయం చేస్తుంటాడు. అయితే లాభాపేక్ష లేకుండా ఇలా పుస్తకాలని డెలివరీ చేయడానికి సింగపూర్‌లో వున్న తన కొడుకు ఆర్థిక సాయాన్ని అందిస్తుంటాడు. తమ తర్వాత ఈ వృత్తిని ఎవరు చేపడతారనేది చెప్పలేకపోయినా తన ఊపిరున్నంత వరకూ ఇలా పుస్తక పఠనాన్ని అభిమానించే కోల్‌కత వాసుల కోసం పనిచేయాలనేది షా ఆశయం.

- శర్వాణి

పనీర్ ఎగ్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

పనీర్ తరుగు-1 కప్పు
పసుపు-1/4 టీ స్పూన్
కార్న్‌ఫ్లోర్-2 టేబుల్ స్పూన్లు
నూనె-వేయించడానికి సరిపడా
బిర్యానీ ఆకులు-2
దాల్చిన చెక్క-1 అంగుళం ముక్క
యాలకులు-2
లవంగాలు-3
జీల కర- 1 టీ స్పూన్
కారం-3 టీ స్పూన్లు
ఉల్లిపాయ తరుగు-1/4కప్పు
వెల్లుల్లి ముద్ద - 1 1/2 టేబుల్ స్పూన్
పసుపు-1/2 టీ స్పూన్
జీలకర్ర పొడి-1 టేబుల్ స్పూన్
ధనియాల పొడి-1 1/2 టీ స్పూన్
ఆమ్‌చూర్ పొడి- 1 టీ స్పూన్
గరం మసాలా పొడి-1/2 టేబుల్ స్పూన్

తయారుచేసే విధానం

పనీర్ తురుమును రెండు సమాన భాగాలుగా చేసుకోవాలి. ఒక భాగం పనీర్‌లో పసుపు, కొద్దిగా ఉప్పు వేసి కలుపుకుని బాల్స్‌లా చేసుకోవాలి. మిగిలిన సగం పనీర్ తురుములో కార్న్ ఫ్లోర్ వేసి చపాతీ పిండిలా కలుపుకుని ఉండల్లా చేసి మధ్యలో ఖాళీ ఉండేలా చేసుకోవాలి. వీటి మధ్యలో బాల్స్‌లా చేసి పెట్టుకున్న పనీర్ ఉండలను పెట్టి ఒక టేబుల్ స్పూన్ నూనెలో దోరగా వేగించి పక్కన పెట్టుకోవాలి.



తర్వాత మరో బాణలిలో రెండు టేబుల్ స్పూన్లు నూనె వేసి వేడెక్కిన బిర్యానీ ఆకు, దాల్చిన చెక్క, యాలకులు, జీలకర వేసి వేగించాలి. తర్వాత ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు, కారం వేసి మరో ఐదు నిమిషాలు వేయించాలి. ఆ తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర పొడి వేసి కొద్దిగా నీళ్ళు పోసి రెండు నిమిషాలు ఉడికించాలి. తర్వాత ఆమ్ చూర్‌పొడి, పనీర్ వేసి ఉడికించుకోవాలి. ఉడికించిన గుడ్డుని రెండు భాగాలుగా చేసి ఈ మిశ్రమంలో వేసి ఉడికించాలి. చిన్న మంటపై ఐదు నిమిషాల పాటు అన్నీ ఉడికే వరకు వుంచి తర్వాత స్టౌపై నుండి దించేయాలి.

చికెన్ వింగ్స్

కావాల్సిన పదార్థాలు

చికెన్ వింగ్స్-పావుకిలో
నిమ్మరసం-1 టీస్పూన్
బత్తాయి రసం-మూడు టేబుల్ స్పూన్లు
సోయా సాస్ -2 టీ స్పూన్లు
నూనె -1/2 టేబుల్ స్పూన్
చెక్కర -2 టేబుల్ స్పూన్లు
అల్లం వెల్లుల్లి పేస్ట్-2 టేబుల్ స్పూన్లు
ఉల్లిపాయలు-2
ఉల్లికాడల తరుగు-2 టేబుల్ స్పూన్లు
ఉప్పు- చిటికెడు

తయారుచేసే విధానం

ముందు రోజు రాత్రే నూనె మినహా మిగిలిన పదార్థాలన్నింటినీ కలిపి చికెన్ ముక్కలకు బాగా పట్టించి పక్కన పెట్టుకోవాలి. వండేటప్పుడు ఒక బాణలిలో నూనె పోసి బాగా వేడెక్కిన తర్వాత చికెన్ ముక్కల్ని వేసి బంగారు రంగు వచ్చే దాకా వేయించుకోవాలి. వాటిపై ఉల్లికాడల తరుగుతో గార్నిష్ చేసుకుంటే చికెన్ వింగ్స్ రెడీ!

నాటుకోడి కూర

కావాల్సిన పదార్థాలు

నాటుకోడి -1 కేజీ
జీడిపప్పు- 100 గ్రా
నూనె-100గ్రా
పచ్చిమిర్చి -50గ్రా
టమాటాలు -1/4 కేజి
ఉల్లిపాయలు -100గ్రా
అల్లం వెల్లుల్లి పేస్ట్-50 గ్రా
పసుపు-చిటికెడు
ఉప్పు-తగినంత
ధనియాల పొడి - 2 టేబుల్ స్పూన్లు
యాలకుల పొడి-చిటికెడు
కొత్తిమీర-2 టీ స్పూన్లు

తయారుచేసే విధానం

మాంసం ముక్కలకు కారం, పసుపు, ధనియాల పొడి పట్టించాలి. జీడి పప్పులో కొద్దిగా నీళ్ళు పోసి ఉడికించి చల్లారిన తర్వాత ముద్ద చేయాలి. స్టౌపై ఒక మందపాటి గిన్నె పెట్టి నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి తర్వాత టమాటా ముక్కలు, కోడి మాంసం వేసి ఉడికించాలి. ముక్క కొద్దిగా ఉడికిన తర్వాత జీడిపప్పు ముద్ద వేసి కొద్దిగా నీళ్ళు పోసి కలిపి ఉడికిం చాలి. దించే ముందు కొత్తిమీర టమాటా ముక్కలతో గార్నిష్ చేసుకోవాలి.

బాల నేస్తాలు

ఆకుతో బొమ్మ



రంగులు అద్దండి

తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో 10 తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.



నేర్చుకుందాం

పిల్లలూ మీకు బొమ్మలు గీయడమంటే భలే ఇష్టం కదా! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ఆస్ట్రిచ్ పక్షి బొమ్మను ఎలా గీయాలో ఇక్కడిచ్చారు. మీరూ జాగ్రత్తగా ప్రయత్నించండి.



కనిపెడదాం

పిల్లలూ పై చిత్రంలో మీకు ఒక చెట్టు కనిపిస్తోంది కదా! ఆ చెట్టు చాటునే కొన్ని కుందేళ్ళు దాగున్నాయి. అక్కడ మొత్తం ఎన్ని కుందేళ్ళు దాగున్నాయో మీరే కనిపెట్టండి.



అతికిద్దాం

చింటూకి ఈ మధ్య అల్లరి మరీ ఎక్కువైపోయింది. ఇక్కడ ఒక ఆక్టోపస్ బొమ్మను కత్తిరించి అతికించకుండా వెళ్లిపోయాడు. పైనున్న బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండే.



గుర్తించండి

MARS ROCKET
SPACE ASTEROID
ALIEN STAR
MOON PLUTO
NEBULA LUNAR

మీకు తెలిసిన కొన్ని గ్రహాల పేర్లను ఇక్కడుంచాం! పైనున్న అక్షరాల పట్టికలో అవెక్కడున్నాయో గుర్తించి పెన్నుతో మార్క్ చేయండి.

K	L	T	U	V	W	E	E	A	L	U	N	A	R	Z	U
K	A	P	E	S	V	B	M	A	Q	J	G	C	L	G	I
M	S	K	E	G	O	W	D	K	O	S	E	U	R	N	M
L	T	N	M	L	J	K	X	I	M	S	Y	P	H	S	D
S	E	R	S	D	A	H	N	W	A	H	I	C	L	B	O
V	R	H	S	I	G	V	X	D	R	D	E	V	R	E	X
R	O	H	R	B	R	B	Q	U	S	P	A	C	E	F	L
F	I	P	A	F	M	T	A	R	I	P	O	A	S	I	W
Q	D	L	O	R	O	C	K	E	T	A	I	G	K	V	F
K	K	O	S	L	O	N	S	T	L	H	Q	A	O	Y	K
N	B	Y	E	I	N	H	H	U	S	W	E	D	H	J	R
J	F	C	Z	M	V	O	B	B	O	L	R	P	T	S	R
E	U	H	A	S	D	E	Q	R	C	B	P	L	U	T	O
W	K	Z	R	X	N	E	I	L	A	L	S	G	E	A	K
O	C	F	E	S	G	W	I	K	J	H	U	D	S	R	M
J	Q	S	O	H	K	A	G	F	V	Z	A	M	E	X	R

బర్డ్ ఫీడర్



పిల్లలూ మీలో చాలా మందికి పక్షులతో ఆడుకోవడమంటే ఇష్టం కదా. కొంతమంది ఇళ్లలోనే వాటిని పెంచుకొని వాటితో ఆటలాడుకుంటారు. మరి కొంత మంది పిల్లలైతే ఆకాశంలో ఎగిరే పక్షులని గమనిస్తూ కాసేపు గడిపేస్తుంటారు. మరి అలా ఆకాశంలో ఎగిరే పక్షులు మీ ఇంటిపైనా వాలాలంటే మా దగ్గర ఒక ఐడియా వుంది. అదే బర్డ్‌ఫీడర్. వీటి ద్వారా పక్షుల ఆకలిని తీర్చడంతోపాటు వాటితో కాసేపు అలా ఆడుకునే అవకాశం దొరుకుతుంది. ఈ బర్డ్ ఫీడర్‌ని మనింటిం వద్ద దొరికే వస్తువులతో. ఎలా తయారు చేసుకోవచ్చో మేం నేర్పిస్తాం. జాగ్రత్తగా మీరూ ప్రయత్నించండి.

కావాల్సిన వస్తువులు :

ట్రాపికానా / ఫ్రూటీ డ్రింక్ ప్యాకెట్-1, మూతలు పెద్దవి-2 (నచ్చిన రంగుల్లో), చిన్నవి-3 (తెలుపు రంగు), క్లిప్-1, కత్తెర, గమ్, ఐస్‌క్రీమ్ స్పూన్-1, గూగుల్ ఐస్ -2 (చిన్నవి)

తయారుచేసే విధానం

ముందుగా ట్రాపి కానా ప్యాకెట్ పైభాగంలోని ఒక చివరని పైకి లాగి దానికి ఒక క్లిప్‌ని వుంచాలి. ప్యాకెట్ పై భాగంలో వుండే మూతకి కాస్త కింది వరుసలో మూతకి ఇరువైపులా రెండు పెద్ద వృత్తాలని గీసుకోవాలి. పెద్ద సైజులో వున్న రెండు బాటిల్ మూతల్ని తీసుకుని వాటి వెనుక భాగంలో గమ్‌ని వుంచి ఆ వృత్తాల్లో అంటించాలి. ఇప్పుడు రెండు చిన్న మూతల్ని తీసుకుని వాటిపై గూగుల్ ఐస్‌ని అంటించాలి. ఈ రెండు మూతల్ని ముందుగా అతికించిన పెద్ద మూతల్లో వుంచి జాగ్రత్తగా గమ్‌తో అతికించుకోవాలి. ఇప్పుడు కన్‌స్ట్రక్షన్ పేపర్‌పై త్రికోణం ఆకారాన్ని గీసి కత్తెరతో కట్‌చేసుకోవాలి. దానికి ఒక వైపు గమ్‌ని వుంచి బాటిల్ మూతలకి మధ్యన వుండేలా వాటి కింద వరుసలో అతికించుకోవాలి. ఇప్పుడు బొమ్మలో చూపిన విధంగా ప్యాకెట్‌పై యూ ఆకారంలో గీసి జాగ్రత్తగా కట్‌చేయాలి. స్పూన్ ఒక చివరని కట్‌చేసి బొమ్మలో చూపిన విధంగా ప్యాకెట్ చివరి భాగంలో గుచ్చాలి. ప్యాకెట్ రెండువైపులా పక్షి రెక్కల ఆకారంలో పెన్‌తో మార్క్ చేసుకోవాలి. కత్తెరతో వాటిని జాగ్రత్తగా కత్తిరించాలి. చివరిగా యూ ఆకారంలో కట్‌చేసిన భాగంలో పక్షులు ఇష్టంగా తినే గింజల్ని వుంచి గూటిని పక్షులకి కనిపించేలా ఇంటి వరండాలో వేలాడదీయాలి.

పదవికాసం 70

కూర్పు: రావెళ్ల

✿	1	2		✿	3	4		✿
5	✿		✿	6	✿		✿	✿
7		✿	8			✿	9	10
	✿	11	✿		✿	12	✿	
13				✿	14			
	✿		✿	15	✿		✿	
16		✿	17			✿	18	
✿	✿	19	✿		✿	20	✿	
✿	21			✿	22			✿

ఆధారాలు

అడ్డం

1. గోదావరి (3)
3. అపజయం (3)
7. ఫ్యాన్ (2)
8. మిర్చి (3)
9. అటు నుండి చెట్టుకు కాసే ఫలం (2)
13. దండు (4)
14. చదును చేసి వరి విత్తనాలు చల్లితే అది ఏమనాలి (4)
16. మొదలు లేని చల్లదనం (2)
17. పలుకు (3)
18. వెదురు బొంగు (2)
21. బొట్టు (3)
22. కొందరు ఉద్యోగులు పనులు చేసేందుకు ఇవి తీసుకుంటారు (3)

నిలువు

2. బాట (2)
4. దుర్గం (2)
5. ఈ పదులు సినారేవే (6)
6. ఏడు రోజులు (3)
10. కలిమి లేములు (6)
11. గుర్రం మీద స్వారీ చేయడం (3)
12. ఆకుపచ్చ రంగు (3)
15. బంగారం (3)
19. అల్లరి (2)
20. చెప్పుడు మాట తిరగబడింది (2)

సుడోకు

5	3			7				
6			1	9	5			
	9	8					6	
8				6				3
4			8		3			1
7				2				6
	6					2	8	
			4	1	9			5
				8			7	9

6	4	7	8	1	5	2	3	9
8	9	3	6	2	4	7	1	5
2	1	5	3	9	7	4	8	6
4	3	1	2	8	9	6	5	7
7	2	6	4	5	3	8	9	1
5	8	9	7	6	1	3	4	2
1	7	4	9	3	2	5	6	8
3	5	8	1	7	6	9	2	4
9	6	2	5	4	8	1	7	3

గతవారం జవాబులు

✿	1 బు	2 ర	ద	✿	3 ఆ	4 చూ	కీ	✿
5 అ	✿	క్తం	✿	6 త	✿	చు	✿	✿
7 గ	వ్వ	✿	8 త	ర	హా	✿	9 య్యి	10 తి
దం	✿	11 దూ	✿	పు	✿	12 కం	✿	ల
13 కా	ట	క	ము	✿	14 చు	పిం	ని	క
రు	✿	లి	✿	15 చూ	✿	చు	✿	ల
16 డు	పా	✿	17 పూ	ర్ణ	ము	✿	18 తో	క
✿	✿	19 భి	✿	ము	✿	20 తూ	✿	ము
✿	21 రా	క్ష	సి	✿	22 గ	రి	ట	✿

గాజులో గాజునై...

రిక్ సతావా ఓసారి ఆక్వేరియమ్‌కు వెళ్లాడు. అద్దాల గుండా సముద్ర జీవుల్ని చూస్తూ మురిసిపోతున్నాడు. ఇంతలో ఓ జెల్లీ ఫిష్ చటుక్కున ఈదుకుంటూ అతడి ముందుకు వచ్చి నిలిచింది. దాన్ని చూసి రిక్ ఆశ్చర్యంగా నోరెళ్లబెట్టాడు. ఓ గాజు బొమ్మకు ప్రాణమొస్తే ఈదేస్తుందేమో అనుకుని తడబడ్డాడు. జెల్లీ ఫిష్ అతడి నిద్ర చెడగొట్టింది. తనకెంతో ఇష్టమైన గ్లాస్‌బ్లోయింగ్ వృత్తిని అది మార్చేసింది. ఓ గాజు బుడగలో జెల్లీ ఫిష్ రూపాన్ని బంధించాలని తపనపడ్డాడు. అలా మూడేళ్ల పాటు ఎన్నో ప్రయోగాలు చేశాక చివరకు దాని మీద పట్టు సంపాదించాడు. గాజు బుడగలో జెల్లీ ఫిష్ ఈదుతున్నట్టు రూపం తెచ్చాడు. ఓ రకంగా ప్రాణమున్న జెల్లీ ఫిష్ అందులో ఉందేమో అనిపిస్తుంది. ఇదంతా 1980ల్లోని జరిగిన విషయం. కానీ ఇన్ని దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ రిక్ సతావా 'గ్లాస్ జెల్లీ ఫిష్'కు వన్నె తగ్గలేదు. ఆదరణ చెదరలేదు.

రిక్ సతావా





హవానా హరివిల్లు



మీరో పాత కాలం నాటి తైలవర్ణ చిత్రాన్ని చూస్తే ఎలాంటి అనుభూతి చెందుతారు. అలా రంగుల్లో, ప్రాచీనతలో కాలం నిలిచిపోతే హవానా వీధుల్లో తిరుగుతుంటారు. క్యూబా రాజధాని నగరమైన హవానా ఓ బరోక్ కళాఖండం. అరుదైన ఆర్కిటెక్చర్‌తో భవంతులే కాదు వాటి మధ్య నుంచి వెళ్లే సన్నని దారులు కూడా ఆ టెక్చర్‌కు సరిపోలుతాయి. వీటి వెంట వెళ్లే క్లాసిక్ కార్లు రంగుల ముద్దల్లా నిదానంగా కదులుతూ ఆకట్టుకుంటాయి. తలుపులు, కిటికీలు, కర్టెన్లు, టెంట్లు ఇలా ప్రతిదీ ఇక్కడ కలర్‌ఫుల్లే. హవానా హరివిల్లు చూసి మీరూ రంగుల్లో నడిచేయండి.







Check List

Book Number	KNBROR B178	Date	3/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	chaklakshmi	Cutting By	lakshmi
Scanned By	Prathiya	Pages	29